ప్రజాశక్తి

ఆదివారం 8 జూన్ 2025 8 పేజీలు



ప్రకాశం



బాపట్ల

కూటమి ప్రభుత్వ వైఫల్యాలతో

రైతుల ఆత్మహత్యలు

వైసిపి జిల్లా అధ్యక్షుడు బూచేపల్లి శివప్రసాదరెడ్డి

- 11న జగన్‌మోహన్‌రెడ్డి పొదిలి రాక



మాట్లాడుతున్న బూచేపల్లి శివప్రసాదరెడ్డి

ప్రజాశక్తి- పొదిలి

కూటమి ప్రభుత్వ వైఫల్యాలతోనే రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నట్లు వైసిపి జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివ ప్రసాదరెడ్డి తెలిపారు. ఈనెల 11న మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పొదిలి పర్యటనకు వస్తున్న సందర్భంగా స్థానిక దర్శి రోడ్‌లో ఏర్పాటు చేస్తున్న హెలిపాడ్ వద్ద శాసన మండలి సభ్యులు టి.రఘురాంతో కలిసి శనివారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శివప్రసాదరెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతుల సమస్యల గురించి పట్టించుకోవడం లేదన్నారు. రైతులను రాజులు చేసిన ఘనత మాజీ ముఖ్యమంత్రులు వైఎస్.రాజశేఖర్ రెడ్డి, జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు రైతులను ఆదుకునేది వైసిపి ప్రభుత్వమేనని తెలిపారు. వైసిపి ప్రభుత్వ హయాంలో పొగాకు, మిర్చి, పత్తికి గిట్టుబాటు ధరలు కల్పించి రైతులకు న్యాయం చేసినట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన

▶ 2లో

రేషన్ 'కంది'పోయింది

- ఐదు నెలలుగా ఇవ్వని వైనం
- బియ్యం,పంచదార సరఫరా



ప్రజాశక్తి-యర్రగొండపాలెం

కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక నిత్యావసరాల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. రేషన్ దుకాణాల ద్వారా సరకులు అరకొరగా సరఫరా చేస్తున్నారు. పేద, మధ్య తరగతి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పేదల ఇంట్లో కందిపప్పు కనుమరుగైంది. మార్కెట్‌లో కొనుక్కునే స్తోమత లేక పప్పు తినడంమే మానేశారు. మార్కెట్లో కందిపప్పు ధర గణనీయంగా పెరిగింది. పౌర సరఫరాల శాఖ ద్వారా కందిపప్పు తీసుకోవాలన్న రేషన్ కార్డుదారుల ఆశలపై కూటమి ప్రభుత్వం నీళ్లు చల్లింది. ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్, మే, జూన్ నెలల్లో కందిపప్పు పంపిణీకి మంగళం పాడింది. ఐదు నెలలుగా కేవలం బియ్యం, పంచదార మాత్రమే అందజేస్తున్నారు. కనీసం జూన్ నెలలో అయినా కందిపప్పు ఇస్తారని కార్డుదారులు ఆశగా ఎదురుచూశారు. ఐదు నెలలుగా కందిపప్పు ఇవ్వకపోవడంపై లబ్ధిదారులు మండిపడుతున్నారు. బహిరంగ మార్కెట్లో కిలో కందిపప్పు ధర రూ.180 నుంచి రూ.200 పలుకుతోంది. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా కిలో రూ.67 అందజేయడంతో లబ్ధిదారులకు కొంత ఊరటగా ఉండేది.

రాగులు, జొన్నలు ఏవీ..

ప్రతి నెలా కార్డుదారులకు కేంద్ర ప్రభుత్వం ద్వారా వస్తున్న ఉచిత బియ్యం మాత్రమే అందజేస్తున్నారు. పంచదార అరకొరగా ఇస్తున్నారు. రాగులు, జొన్నలు అందజేస్తామని పౌరసరఫరాల శాఖ మంత్రి మనోహర్ ప్రకటించారు. అయితే ఫిబ్రవరిలో జొన్నలు

▶ 2లో

ప్రతి ఆకూ కొనుగోలు చేస్తాం

- మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ కరుణశ్రీ
- నల్లబర్లీ పొగాకు కొనుగోలు కేంద్రం ప్రారంభం



పొగాకు కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కరుణశ్రీ

ప్రజాశక్తి - పర్చూరు

రైతులు పండించిన నల్లబర్లీ పొగాకును చివరి ఆకు వరకూ మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేస్తామని మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ కరుణశ్రీ తెలిపారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన నల్లబర్లీ పొగాకు కొనుగోలు కేంద్రాన్ని శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పర్చూరు,మార్టూరు, ఇంకొల్లు, నందిపాడులో

▶ 2లో

అప్పుల బాధతో కౌలురైతు ఆత్మహత్య

- సుందరయ్య కాలనీలో చోటు చేసుకున్న ఘటన



ఆత్మహత్య చేసుకున్న పెద్ద యల్లమందయ్య

ప్రజాశక్తి-మార్కాపురం

మిర్చి పంటకు గిట్టుబాటు ధర లభించలేదు. పంటను నమ్ముకుని రూ. లక్షల్లో పెట్టుబడులు పెట్టిన రైతన్నలు అప్పుల్లో మునిగిపోయారు. పెట్టుబడిలో పదో వంతు కూడా రాకపోవడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. పంటల సాగు తెచ్చిన అప్పులకు వడ్డీ తోడవ్వడంతో భారంగా మారింది. అప్పిచ్చిన వారు బాకీ తీర్చాలనే ఒత్తిళ్ళతో దిక్కుతోచని స్థితిలో రైతన్నలు ఉన్నారు. ఈ నేపథ్యంలో ఓ కౌలు రైతు అప్పుల బాధ తాళలేక ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన

▶ 2లో

కూటమి ప్రభుత్వ ఏడాది పాలనలో

ప్రజలు విసిగిపోయారు

సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు డి.రమాదేవి



మాట్లాడుతున్న సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు రమాదేవి

ప్రజాశక్తి - బాపట్ల

కూటమి ప్రభుత్వ ఏడాది పాలనలో ప్రజలు విసిగి పోయినట్లు సిపిఎం కేంద్ర కమిటీ సభ్యురాలు డి.రమాదేవి తెలిపారు. స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య ప్రజాసంఘాల కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో రమాదేవి మాట్లాడారు. గత ప్రభుత్వ అప్రజాస్వామిక వైఖరితో ప్రజలు విసిగి పోయినట్లు తెలిపారు. కొత్త ప్రభుత్వం మంచి ప్రభుత్వం రావాలని భావిస్తే అంతకుమించి నిరంకుశమైన ప్రభుత్వంగా కూటమి ప్రభుత్వ ఏడాది పాలన రుజువు చేస్తుందని ఆమె పేర్కొన్నారు.బుల్‌డోజర్ రాజ్యాన్ని స్థాపించి అనాగరికమైన పాశవికంగా విజయవాడలో కళాశాలను నేలమట్టం చేసిన అర్ధరాత్రి ఘటనపై ప్రభుత్వం ఏం సమాధానం చెబుతుందని పౌర సమాజం ప్రశ్నిస్తుందన్నారు. దీనిపై ప్రభుత్వం సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. పేదవారికి ప్రత్యామ్నాయం చూపకుండా రఘురామ కృష్ణంరాజు రోడ్డు పక్కనే ఉన్న ఇళ్లను పర్యావరణం పేరుతో కూల్చే వేయించి ప్రజలను రోడ్డుపాలు చేశారన్నారు. గత ప్రభుత్వానికి ధీటుగా ఈ ప్రభుత్వం కూడా కూల్చేవేతల ప్రభుత్వంగా

▶ 2లో

కూటమి ప్రభుత్వ ఏడాదిపాలనలో ప్రజలు విసిగిపోయారు

(మొదటిపేజీ తరువాయి)

పేరు గడిస్తుందన్నారు. తెనాలిలో దళిత యువకులను నడి బజారులో పోలీసులు లాఠీలతో కొట్టడం అమానవీయమైన చర్య అని తెలిపారు. ప్రజలను బహిరంగంగా కొట్టే అధికారం పోలీసులు ఎక్కడుందని ఆమె ప్రశ్నించారు. నిందితులైతే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, ఇష్టానుసారంగా వ్యవహరించిన ఈ సంఘటనపై ప్రభుత్వం సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. ఏ కులం వారినైనా కొట్టకూడదని చట్టం చెబుతోందన్నారు. అందుకు భిన్నంగా పోలీసులు వ్యవహరించిన తీరు రాష్ట్రవ్యాప్తంగా విమర్శలకు దారితీస్తుంది అన్నారు. సాంప్రదాయాలు, గౌరవాలను పక్కనపెట్టి పవన్, బిజెపి, కూటమి భాగస్వాములు మతసామరస్యానికి విఘాతం కలిగించే పద్ధతుల్లో వ్యాఖ్యలు చేయడం రాష్ట్రాన్ని ఎటు వైపు తీసుకెళు_న్నారో ప్రజలు ఆలోచించాలన్నారు. భారత ప్రభుత్వం అనుసరించిన విదేశాంగ విధానాలు చాలా ప్రమాదకరంగా ఉన్నాయన్నారు. వ్యవసాయానికి గిట్టుబాటు ధర లేక పండించిన పంట నిల్వ ఉంచుకునేందుకు గిడ్డంగులు లేక ప్రజలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి గంగయ్య మాట్లాడుతూ పర్చూరు ప్రాంత నల్లబర్లీ పొగాకు కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాన్నారు.రైతులకు గిట్టుబాటు ధర కల్పించేందుకు పొగాకు ధరను స్థిరీకరణ చేసి ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో కృష్ణమోహన్, కెవిపిఎస్ రాష్ట్ర కార్యదర్శి ఎం. మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.

అప్పుల బాధతో కౌలు రైతు ఆత్మహత్య

(మొదటిపేజీ తరువాయి)



పెద యలమందయ్య (ఫైల్)

మార్కాపురం పట్టణ పరిధిలోని సుందరయ్య కాలనీలో శనివారం చోటు చేసుకుంది.

కౌలు రైతు రాజారపు పెద్ద యల్లమందయ్య (56) స్వగ్రామం తర్లుపాడు మండలంలోని మీర్జపేట. అతనికి భార్య కాశమ్మ, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. కుమార్తెలకు వివాహాలు చేశాడు. ఆయన సెంటు భూమి లేదు. కనీసం సొంత గూడూ లేదు. వ్యవసాయం తప్ప మరో పని తెలియని తెలిపారు. గత 20 ఏళ్ల క్రితం మార్కాపురం వచ్చాడు. ఆరు ఎకరాల పొలం కౌలుకు తీసుకున్నాడు. ఏటా మిర్చి పంటను సాగు చేస్తున్నాడు. ఈ ఏడాది కూడా ఆరు ఎకరాల్లో మిర్చి సాగు చేశాడు. మిర్చికి తెగుళ్ల తోడవ్వడంతో పెట్టుబడులు పెరిగాయి. ఎకరానికి రూ. 2లక్షల మేర పెట్టుబడి పెట్టాడు. అయినప్పటికీ తెగుళ్ళ కారణంగా ఆశించిన మేర దిగుబడి కూడా రాలేదు. అరకొరగా వచ్చిన దిగుబడులు గుంటూరులోని మిర్చి యార్డుకు తరలించారు. క్వింటా రూ. 10వేలకు మించి అమ్ముడు పోలేదు. మిర్చి కోతకు క్వింటాకు రూ.6 వేలకు పైగా ఖర్చు అయ్యింది. దీంతో ఆదాయం రాకపోగా పెట్టుబడిలో లోటు కనిపించింది. పెద్ద యల్లమందయ్య కౌలు రైతుగా బ్యాంకులు అప్పు ఇవ్వలేదు. ప్రైవేటు వ్యక్తుల వద్ద అధిక వడ్డీలకు రుణం తీసుకున్నాడు. అసలు, వడ్డీతో కలిపి రూ. 25లక్షల మేర అప్పు తేలింది. అప్పుఇచ్చిన వారు తమ బాకీ తీర్చాలని ఇంటికి వస్తున్నారు. ఎక్కడ కనిపిస్తే అక్కడ బాకీ తీర్చాలని నిలేస్తున్నారు. దీంతో పెద్ద యల్లమందయ్య మనస్తాపానికి గురయ్యాడు. వ్యవసాయం కలిసిరాక... సొంత ఆస్తులు లేక... పెరిగిన అప్పులు తీర్చే అవకాశం కనిపించక పోవడంతో పొలం వద్ద పురు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు డి.సోమయ్య డిమాండ్ చేశారు. పెద్ద యల్లమందయ్య ఆత్మహత్య విషయం తెలుసుకున్న మార్కాపురం పట్టణ ఎస్ఐ ఎం.సైదుబాబు, డిప్యూటీ తహశీల్దారు శ్రీనివాస్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం మార్కాపురం ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రతిభా పురస్కారానికి ఎంపిక





ప్రజాశక్తి-మర్రిపూడి

ఎపి షైనింగ్ స్టార్స్ ప్రతిభా అవార్డులకు మర్రిపూడి మండలం నుంచి ఆరుగురు విద్యార్థులు ఎంపికైనట్లు ఎంఈవో ఈవి రంగయ్య తెలిపారు. ఉలవపాటి నిహారిక 565 మార్కులు, రమావత్ సాయి సాత్విక 573 మార్కులు, కాకర్ల గ్రామంలోని దీపిక పబ్లిక్ స్కూల్ నుంచి మొలల దీప్సికా రెడ్డి 587 మార్కులు, గుండ్లపల్లి వైష్ణవి 586 మార్కులు, ఉరియా వాసు 579 మార్కులు, మన్నేపల్లి మోహన్, సాయి దివ్య 573 మార్కులతో ఎంపికైనట్లు తెలియజేశారు. వీరికి జూన్ 9వ తేదీన ఒంగోలులో జరిగే కార్యక్రమంలో నగదు, ప్రశంసా పత్రాలు అందజేస్తారని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను పాఠశాల యాజమాన్యాలను, తల్లిదండ్రులను అభినందించారు.

వైభవంగా అంకాలమ్మ తిరునాళ్ల

ప్రజాశక్తి-కొనకనమిట్ల: కొనకనమిట్లలో కొలువైన అంకాలమ్మ తిరునాళ్ల శనివారం వైభవంగా జరిగింది. భక్తులు ఉదయం నుంచి తరలివచ్చి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి, వైసీపీ ఆధ్వర్యంలో రెండు విద్యుత్ ప్రభలను, సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు మహిళలు, పురుషులు జట్లు వేరువేరుగా కోలాటాలు నిర్వహించారు. ఇవి భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి.

రేషన్ 'కంది'పోయింది

(మొదటిపేజీ తరువాయి)

అరకొర ఇచ్చినా, రాగుల ఊసే లేదు. ఎన్నికల మేనిఫెస్టోలో రేషన్ డిపో ద్వారా అన్ని రకాల సరకులు రాయితీ ధరలకు ఇస్తామని, సంక్రాంతి కానుకలు అందిస్తామని కూటమి నాయకులు ఊదరగొట్టారు. కానుకల మాట అటుంచితే ప్రతి నెలా ఇచ్చే సరకులు కూడా సక్రమంగా ఇవ్వడం లేదని జనం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



ఐదు నెలలుగా ఇవ్వడం లేదు

కేశనపల్లి సుబ్బమ్మ, యర్రగొండపాలెం

రేషన్ సరుకులు సక్రమంగా సరఫరా చేయకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. ఐదు నెలలుగా కంది పప్పు ఇవ్వడం లేదు. జనవరిలో ఇచ్చారు. వచ్చే నెలలో అయినా కందిపప్పు పంపిణీ చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.



పేదలపై చిన్నచూపు తగదు

ఆవుల యేసుబాబు, యర్రగొండపాలెం

కూటమి ప్రభుత్వం ఒక్క హామీని కూడా నెరవేర్చలేదు. కనీసం కందిపప్పు కూడా కార్డుదారులకు ఇవ్వడం లేదు. బయట మార్కెట్లో కొందామంటే ధరలు ఎక్కువగా ఉన్నాయి. దీంతో పేదలకు కందిపప్పు కూడా తినలేని పరిస్థితి ఉంది. ప్రభుత్వం కంది పప్పు సరఫరా చేయాలి.

కూటమి ప్రభుత్వ వైఫల్యాలతో.. రైతుల ఆత్మహత్యలు

(మొదటి పేజీ తరువాయి)

తర్వాత ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు తెలిపారు. రాజకీయ కక్షతో వైసిపి నాయకులు, కార్యకర్తలపై కేసులు పెడుతున్నట్లు తెలిపారు. ప్రస్తుతం లో గ్రేడ్ పొగాకును కొనుగోలు చేయడం లేదన్నారు. అనంతరం హెలిపాడ్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో శాసన మండల సభ్యులు తలశిల రఘురాం, నాయకులు కెవి.రమణారెడ్డి, వై. వెంకటేశ్వరరావు, సానికొమ్ము శ్రీనివాస్ రెడ్డి, వైఎం. ప్రసాద్ రెడ్డి, కోవెలకుంట్ల నరసింహారావు, శంకర్, గొలమారి చెన్నారెడ్డి, జి.శ్రీను, గుజ్జుల రమణారెడ్డి, గుజ్జుల సంజీవరెడ్డి, ఎస్కె. రబ్బాని, మస్తాన్ వలి, అంబవరపు నారాయణరెడ్డి, దోర్నాల వరలక్ష్మమ్మ, నందిపాలెం నారాయణ, కేకేమిట్ల మండల నాయకులు మోరబోయిన మురళీకష్ణ, మోరా శంకర్ రెడ్డి, సిరుగురి కోటేశ్వరరావు, ఏలూరు సంజీవరెడ్డి, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రతి ఆకూ కొనుగోలు చేస్తాం

(మొదటి పేజీ తరువాయి)

పొగాకు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఏ గ్రేడ్ పొగాకు ధర ఎంత అనే విషయంపై త్వరలో మార్గదర్శకాల జీవో విడుదల చేయనున్నట్లు తెలిపారు. 15 రోజుల్లో పూర్తిస్థాయిలో కొనుగోలు ప్రారంభిస్తామని తెలిపారు. ఎమ్మెల్యే సాంబశివరావు కషి ఫలితంగా ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా పొగాకు కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా గ్రామాలు, ప్రాంతాల వారీగా పొగాకును కొనుగోలు చేస్తామని చెప్పారు. తొలి రోజు నాగులపాలెం గ్రామానికి చెందిన దాసి కిరణ్‌కు సంబంధించిన 6.40 క్వింటాళ్ల పొగాకును కొనుగోలు చేశారు. క్వింటా ధర రూ. 12 వేల నిర్ణయించారు. మార్క్‌ఫెడ్ ద్వారా నల్లబర్లీ కొనుగోలుకు కేంద్రాన్ని ప్రారంభించడం పట్ల రైతులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు షేక్ షంషుద్దీన్, రంగయ్య చౌదరి, కారుమంచి కష్ణ, కొల్లా శ్రీనివాసరావు, వెంకటేశ్వర్లు, మానం హరిబాబు, పి. శ్రీనివాసరావు, ఎఎంసి కార్యదర్శి తిరుపతి రాయుడు, ఎఎంసి సిబ్బంది, పొగాకు రైతులు పాల్గొన్నారు

ఉత్తీర్ణతలో కొండపి కళాశాలకు ప్రథమ స్థానం

ప్రజాశక్తి-కొండపి

ఇంటర్ ఫలితాలలో ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రతిభ చూపినట్లు ప్రిన్సిపల్ ఎం వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 98 శాతం ఉత్తీర్ణతగా నమోదయిందన్నారు. జూనియర్ బైపీసీలో కుంచాల ప్రవల్లిక 432 మార్కులు, మోరుపాకల దివ్యశ్రీ 429 మార్కులు, పసుమర్తి హెప్సిబా 427తో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారని తెలిపారు. జూనియర్ సీఈటీలో షాదుల్లా 471, చింతగుంట్ల డేవిడ్ జూనియర్ ఎంపీసీలో 430, జాషువా జూనియర్ ఎంపీసీలో 409 మార్కులతో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారని తెలిపారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపల్ ఎం వెంకటేశ్వర్లు, అధ్యాపక సిబ్బంది అభినందించారు.

దళితులపై చిత్తశుద్ధి టీడీపీకే ఉంది

మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి - శింగరాయకొండలో ఎస్సీ హాస్టల్ పనులు పరిశీలన

ప్రజాశక్తి-శింగరాయకొండ

దళితులపై చిత్తశుద్ధి ఎవరికీ ఉందో ఒక్కసారి వెనక్కి తిరిగి చూసుకోవాలని, హత్యలు చేసే వైసీపీకా.. అభివృద్ధి చేసి చూపిస్తున్న కూటమి ప్రభుత్వానికో ప్రజలు తెలుసుకోవాలని మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి అన్నారు. శనివారం శింగరాయకొండలోని ఎస్సీ బాలుర హాస్టల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. డిఈ జగన్మోహ న్రావుతో మాట్లాడి హాస్టలను సుందరంగా తీర్చిదిద్దే విధంగా పనిచేయాలన్నారు. విద్యా సంవత్సరం మొదలైందని పనులు వేగ వంతంగా చేయాలని, హాస్టల్‌కి వచ్చిన విద్యార్థికి ఈ హాస్టల్ చూసి ఆనందంగా చదువుకునే విధంగా తయారు చేయాలన్నారు. గత ఐదు సంవత్సరాల్లో ఈ హాస్టల్‌కి ఒక్క రూపాయి కూడా ఖర్చు పెట్టలేని పరిస్థితి ఉందన్నారు. దళితులని హత్యలు చేసి డోర్ డెలివరీ చేసే వైసీపీ నాయ కులకి దళితుల సంక్షేమం, అభివృద్ధి గురించి మాట్లాడే హక్కు లేదన్నారు. చిత్తశుద్ధి అంటే ఏమిటో కూటమి ప్రభు త్వం చూపిస్తుందని వివరించారు. విద్యా సంవత్సరం మొ దలు కావడానికి రోజుల్లోనే ఉన్నప్పటికీ ఈ హాస్టలను రూప రేఖలు మార్చి అభివృద్ధి చేస్తున్నామన్నారు. హాస్టల్లో ఆట స్థలంలో క్రికెట్ వాలీబాల్ షటిల్ ఆడుకునే విధంగా కోర్టును తీర్చిదిద్దాలని సూచించారు. వీరి వెంట రిటైర్డ్ ఏఇ కోట(శ్రీహరి, చీమకుర్తి కృష్ణ, కూనపురెడ్డి సుబ్బారావు, మిం చాల బ్రహ్మయ్య, నక్క బ్రహ్మేశ్వరరావు, సుదర్శన్, ప్రసాద్ రావు, శీలం సుబ్రహ్మణ్యం, ఓలేటి రవిశంకర్‌రెడ్డి, అంబటి శ్రీను, ఉమ్మడిశెట్టి రామారావు వీరి వెంట ఉన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న మంత్రి స్వామి



బీచ్ వద్ద ఏర్పాట్లు పరిశీలిస్తున్న అధికారులు

నేడు బీచ్ వద్ద యోగా

ప్రజాశక్తి-కొత్తపట్నం

కొత్తపట్నం బీచ్‌లో నేడు యోగా కార్యక్రమం ఉదయం 6 గంటల నుంచి 8 గంటల వరకు జరుగుతున్నట్లు ఒంగోలు ఆర్డీవో లక్ష్మీ ప్రసన్న తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆ ప్రాంత ప్రజలు ప్రస్తుతం పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. పాల్గొనేవారు మ్యాట్‌ను తీసుకొని రావాల్సిందిగా తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సరియా పాల్గొంటారని తెలియజేశారు. స్థలం పరిశీలన చేసిన వారిలో ఆర్డిఒ లక్ష్మీ ప్రసన్న, డీఎంహెచ్‌వో, తహశీల్దార్ మధుసూదన్ రావు, ఎంపీడీవో శ్రీకృష్ణ, ఈఓఆర్డి మూర్తి, డిప్యూటీ తహశీల్దార్ కృష్ణమోహన్, వీఆర్వోలు, సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక నిర్ణయాలు ఉపసంహరించుకోవాలి

9న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి

సిఐటియు జిల్లా అధ్యక్షుడు కాలం సుబ్బారావు

ప్రజాశక్తి-చీమకుర్తి

కార్మికుల నడ్డి విరుస్తూ, వారి హక్కులను కాలరాసే విధంగా రాష్ట్ర ప్రభుత్వం కుట్రపూరితంగా పనిగంటలు పెంచుతూ తీసుకున్న మంత్రివర్గ నిర్ణయాలను వెంటనే ఉపసంహరించుకోవాలని సిఐటియు జిల్లా అధ్యక్షుడు కాలం సుబ్బారావు డిమాండ్ చేశారు. శనివారం చీమకుర్తిలో గ్రానైట్ కార్మికులతో గేట్ మీటింగ్లో మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల హక్కులను హరిస్తూ పెట్టుబడిదారుల ప్రయోజనాల కోసం కార్మికుల చట్టాలను మారుస్తున్నారని ఆయన విమర్శించారు. ఇటీవల రాష్ట్ర ముఖ్యమంత్రి సిఐఐ సమావేశంలో మాట్లాడుతూ సంపద సృష్టికర్తలు పారిశ్రామికవేత్తలే అని వ్యాఖ్యానించడం వెనక ఇదే అంశం దాగి ఉందన్నారు. సంపద సృష్టికర్తలు కార్మికులైతే దాన్ని వక్రీకరించి చేసిన వ్యాఖ్యలు కార్మికుల మనోభావాలను దెబ్బతీసేవిగా ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు. మహిళలు రాత్రిపూట కూడా పనిచేయవచ్చు అన్న తీర్మానం చేయడం పట్ల ఆయన తీవ్రంగా విమర్శించారు. శ్రామిక మహిళలకు పని ప్రదేశాలలో సరైన రక్షణ లభించడం లేదని, ప్రతి పరిశ్రమలో సేఫ్టీ కమిటీలు ఏర్పాటు చేయాలని చేసిన తీర్మానం ఎక్కడా అమలు కావటం లేదని తెలిపారు. ఇప్పుడు మహిళలు కూడా రాత్రిపూట పని చేయొచ్చని తీర్మానం చేయటం సిగ్గు చేటని తెలిపారు. వెంటనే రాష్ట్ర మంత్రివర్గం చేసిన కార్మికుల పని గంటలు పెంపు, మహిళలకు నైట్ డ్యూటీ, కార్మిక చట్ట సవరణ నిర్ణయాలు వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. జూలై 9వ తేదీన జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. కార్మిక వర్గం పెద్ద ఎత్తున పాల్గొని ప్రభుత్వాలకు బుద్ధి చెప్పాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి పల్లాపల్లి ఆంజనేయులు, గ్రానైట్ వర్కర్స్ యూనియన్ నాయకులు జి అప్పలనాయుడు, కనకరాజు, పుల్లయ్య, శ్రీను, ప్రసాదు, సూర్యనారాయణ, రమణ, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కాలం సుబ్బారావు

జోరుగా మట్టి తరలింపు

గుల్లవుతున్న జంగంవారిపల్లి చెరువు

ఆందోళన చెందుతున్న రైతులు

ప్రజాశక్తి-సిఎస్‌పురం రూరల్

బికెవి గ్రీన్ ఫీల్డ్ హైవే రోడ్డు నిర్మాణం కోసం మండలంలోని జంగంవారి పల్లి చెరువు నుంచి మట్టిని జోరుగా తరలిస్తున్నారు. ఇరిగేషన్ శాఖ అధికారులు అనుమతి ఇచ్చారంటూ చెరువుకు పక్కనే ఉన్న రెవెన్యూ భూముల్లోని మట్టిని కూడా తరలిస్తున్నట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నా రు. ఇరిగేషన్ అధికారులు లేకుండా మట్టిని తర లించడంపై గ్రామస్తులు అభ్యంతరం వ్యక్తం చేస్తు న్నారు. చెరువులో ఎక్కువ లోతుగా మట్టి తీయ డం వల్ల చెరువుకు నీరు చేరితే నీరు భూమిలోకి ఇంకిపోయే ప్రమాదం ఉందంటూ రైతులు ఆం దోళన చెందుతున్నారు. ఈ విషయంపై సర్పంచ్ రుక్మిణమ్మ ప్రజాశక్తితో మాట్లాడుతూ అక్కడ మట్టి తీస్తున్న విషయం తమకు తెలియదన్నా రు. ఈ విషయంపై ఇరిగేషన్ శాఖ ఈఈ శివ రామ ప్రసాద్‌ను వివరణ కోరగా మట్టి తీసుకు నేందుకు తాము అనుమతి ఇచ్చామని, మట్టి తీసే సమయంలో మా అధికారులు దగ్గర ఉం డాల్సిన అవసరం లేదని చెప్పడం గమనార్హం.



మట్టి తరలింపును అడ్డుకున్న వీఆర్వోలు

ఈ విషయంపై తహశీల్దార్ పి.వెంకటేశ్వర్లును వివరణ కోరగా మట్టి తీస్తున్న విషయం తమకు తెలియదని వీఆర్వోను పంపించి విచారిస్తామని చెప్పారు.

అడ్డుకున్న రెవెన్యూ అధికారులు

జంగంవారిపల్లి చెరువు నుంచి మట్టి తరలిం చడాన్ని రెవెన్యూ అధికారులు నిలిపివేశారు. తహశీల్దార్ వెంకటేశ్వర్లు ఆదేశాలతో వీఆర్వోలు మాలకొండయ్య, ఓబులపతిలు సంఘటన స్థలానికి వెళ్లారు. మట్టి తరలిస్తున్న వారి వద్ద ఎటువంటి అనుమతులు లేకపోవడంతో మట్టి తరలించడాన్ని అడ్డుకున్నారు. అనుమతులు ఉంటే తహశీల్దార్‌కు చూపించి ఆ పై మట్టి తీయాలని అప్పటివరకు మట్టి తీయడాన్ని ఆపాలని తెలియజేసినట్లు వీఆర్వోలు చెప్పారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి

పట్టణంలో పర్యటించిన ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర

ప్రజాశక్తి-కనిగిరి

కనిగిరి మున్సిపాలిటీ పరిధిలోని ఒకటి నుంచి 5 వార్డులలో శనివారం కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి పర్యటించారు. ప్రజలను సమస్యలు అడిగి సమస్యలు తెలుసుకున్నారు. వార్డులలో సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక దృష్టి సారించాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. రోడ్లు, సైడ్ కాలవలు వంటి పనులు వీలైనంత త్వరగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు. పట్టణంలో మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ డేనియల్ జోసెఫ్, టిడిపి పట్టణ అధ్యక్షులు తమ్మినేని శ్రీనివాస్ రెడ్డి, నాయకులు రాచర్ల వెంకట నారాయణ, ఈదర రవికుమార్, అరుణమ్మ, తులసి తదితరులు పాల్గొన్నారు.



ఇందిరా కాలనీలో సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే ఉగ్ర

ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

పెద్దదోర్నాల మండలంలోని ఎడవల్లి సమీపంలోని బలి జేపల్లి వెళ్లే రహదారిలో కొండపై ఎడవల్లి గ్రామానికి చెందిన సుధాకర్ అనే వ్యక్తి చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకు న్నాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. సుధా కర్‌ను ఆయన భార్య మద్యం సేవించొద్దు అంటూ ప్రతిరోజూ అతనికి చెబుతుండేది. ఈ క్రమంలో భార్యాభర్తల మధ్య పలు మార్లు ఘర్షణ జరిగింది. తీరు మార్చుకోకపోతే పుట్టింటికి వెళ్లిపోతానని భార్య చెబుతూ ఉండేది. ఈ క్రమంలో నాలుగు రోజుల నుంచి అతను కనిపించకపోవడంతో తల్లిదండ్రులు పలుచోట్ల వెతికారు. సుధాకర్ ఉరి వేసుకొని ఆత్మహత్య చేసు కొని ఉండడం గమనించారు. విషయాన్ని పోలీసులకు చేశారు. మృతుడికి ఇద్దరు కుమార్తెలు, భార్య ఉన్నారు. ఎస్ఐ మహేష్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మృతదేహం బంధువులకు అప్పగింత

ప్రజాశక్తి- సిఎస్‌పురం రూరల్

మండలంలోని ముండ్లపాడు సమీపంలో గ్రీన్ ఫీల్డ్ హైవే రోడ్డు బ్రిడ్జి వద్ద గత గురువారం గుర్తించిన గుర్తుతెలియని మృతదేహాన్ని మండలంలోని అయ్యలూరివారిపల్లి గ్రామానికి చెందిన గానుగపెంట తిరుమలరెడ్డి (77)గా గుర్తించారు. మృతదేహాన్ని మృతుని బంధువులకు అప్పగించినట్లు ఎస్ఐ ఎం.వెంకటేశ్వర నాయక్ తెలిపారు. మతి స్థిమితం సరిగా లేని తిరుమలరెడ్డి గత సోమవారం సిఎస్‌పురం వచ్చి ముళ్ల పాడు వెళ్లే దారిలో మృతి చెందినట్లు చెప్పారు. మృత దేహానికి పోస్ట్ మార్టం నిర్వహించి శనివారం బంధువులకు అప్ప గించినట్లు ఎస్సై చెప్పారు.

చోరీకి గురైన మోటార్ సైకిల్ లభ్యం

ప్రజాశక్తి-సిఎస్‌పురం రూరల్

సిఎస్‌పురంలోని పామూరు రోడ్డులో ఉన్న గంగోత్రి మిల్క్ డైరీ వద్ద శుక్రవారం చోరీకి గురైన మోటార్ సైకిల్ లభ్యమైనట్లు ఎస్సై ఎం.వెంకటేశ్వర నాయక్ తెలిపారు. మిల్క్ డైరీ వద్ద పార్క్ చేసి వున్న మోటార్ సైకిల్‌ను శుక్రవారం మధ్యాహ్న సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు తీసుకెళ్లిన విషయం విదితమే. ఈ చోరీ ఘటనపై కేసు నమోదు చేసి విచారణ చేపట్టగా కోవిలంపాడు సమీపంలో మోటార్ సైకిల్‌ను గుర్తించి యజమానికి అప్పగించినట్లు చెప్పారు. చోరీకి పాల్పడిన వ్యక్తిని గుర్తించాల్సి ఉన్నట్లు తెలిపారు.

కాంగ్రెస్ నేత ప్రసాదరావు మృతి

ప్రజాశక్తి-టంగుటూరు



ప్రసాదరావు (ఫైల్)

కాంగ్రెస్ పార్టీ నాయకులు, జిల్లా కాంగ్రెస్ పార్టీ మాజీ అధికార ప్రతినిధి, టంగుటూరు మాజీ ఎంపీటీసీ సభ్యులు బొడ్డ సతీష్ తండ్రి బొడ్డ ప్రసాద్ రావు మృతి చెందారు. పంజాబ్ నేషనల్ బ్యాంకు మేనేజరుగా పనిచేసి పదవీ విరమణ పొందిన ప్రసాదరావు ఇటీవల అనారోగ్యానికి గురయ్యారు. కిమ్స్ వైద్య శాలలో చికిత్స పొందుతూ హార్ట్ ఫెయి ల్యూర్‌తో శుక్రవారం రాత్రి మృతి చెందారు. ఆయన పార్థివ దేహాన్ని టంగుటూరు పట్టణంలోని బుచ్చిరాజుపాలెంలో వారి స్వగృహం వద్ద ఉంచారు. అంత్యక్రియలు ఆదివారం ఉదయం నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.



వృద్ధాశ్రమంలో అన్నదానం చేస్తున్న దాతలు

వృద్ధులకు అన్నదానం

ప్రజాశక్తి-కనిగిరి

సిఎస్‌పురం మండలం బొంతవారిపల్లికి చెందిన దుగ్గ జయమ్మ వర్ధంతిని పురస్కరించుకుని ఆమె కుమారుడు కీర్తిశేషులు దుగ్గ రాజశేఖర్ రెడ్డి సతీమణి సరళ శనివారం కనిగిరి పట్టణంలోని శ్రీ వాసవి వృద్ధాశ్రమంలోని వృద్ధులకు అన్నదానం చేశారు. వర్ధంతి సందర్భంగా ఆకలి తీర్చేలా అన్నదానం చేసిన దాతలకు వృద్ధాశ్రమం నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.

సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులకు 'మాన్యువల్' కౌన్సిలింగ్ నిర్వహించాలి


భట్టిప్రోలులో నిరసన తెలుపుతున్న ప్యాప్టో సభ్యులు

ప్రజాశక్తి - భట్టిప్రోలు

పాఠశాల విద్యా కార్యదర్శి సమక్షంలో ఇచ్చిన హామీ మేరకు సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులకు మ్యానువల్ కౌన్సిలింగ్ నిర్వహించాలని ప్యాప్టో ఆధ్వర్యంలో ఉపాధ్యాయ సంఘాలు శనివారం నిరసన వ్యక్తం చేశాయి. స్థానిక మండల విద్యా వనరుల కేంద్రం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ నాయకులు మాట్లాడుతూ మే 19, 20తేదీల్లో పాఠశాల విద్యా కార్యదర్శి కోన శశిధర్ సమక్షంలో జరిగిన చర్చల్లో సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులకు మాన్యువల్ కౌన్సిలింగ్ ద్వారా బదలీలు చేపడుతామని హామీని ఇచ్చారని, ఇచ్చిన హామీని విస్మరించి ఎస్‌జిటిలు వెబ్ ఆప్షన్ పెట్టుకోవాలని ప్రకటించటం ఇచ్చిన హామీని ఉల్లంఘించటమేనని ఆరోపించారు. అంతేకాక ప్రధానోపాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్లకు జరిగిన బదలీలు, పదోన్నతుల్లో కూడా సాంకేతిక సమస్యల కారణంగా తీవ్ర అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. సాంకేతిక సమస్యల కారణంగా నష్టపోయిన ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. చాలా మంది ఉపాధ్యాయులు రిక్వెస్ట్ బదలీలకు దరఖాస్తు చేసుకున్నప్పటికీ బదిలీల వెబ్‌సైట్‌లో తప్పనిసరి బదలి చూపటంతో వారు బదలి ఆప్షన్ ఇచ్చుకోలేక పోయారని వాపోయారు. ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు ఎంపిక చేసుకున్న ఖాళీలను కేటాయించకపోవడం, సదరు ఖాళీలను పదోన్నతుల కింద చూపటంతో సీనియారిటీ ఉపాధ్యాయులకు నష్టం జరిగిందన్నారు. కొన్ని పాఠశాలల్లో ఒక పోస్టు ఖాళీగా ఉండగా ఆ పోస్టుకు ఇద్దరు ఉపాధ్యాయులను కేటాయించడంతో ఉపాధ్యాయులకు నష్టం జరిగిందన్నారు. బదిలీ ఉత్తర్వులు 22లో పేర్కొన్న నిబంధనలకు విరుద్ధంగా తీసుకున్న కొన్ని నిర్ణయాల ఫలితంగా కొంతమంది ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చిందని పేర్కొన్నారు. ఇచ్చిన హామీకి అనుగుణంగా సెకండరీ గ్రేట్ ఉపాధ్యాయులకు మ్యానువల్ కౌన్సిలింగ్ నిర్వహించాలని, సాంకేతిక సమస్యల కారణంగా నష్టపోయిన ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని కోరారు. ఈ సమస్యలు పరిష్కారం కాకపోతే 8న డీఈఓ కార్యాలయం ముట్టడికి పిలుపునిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్, ఎపిటిఎఫ్, ఎస్‌టియు తదితర యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

అద్దంకి : ఐక్య ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు సంబంధించిన బదిలీల్లో సెకండ్ గ్రేడ్ ఉపాధ్యాయులకు మాన్యువల్ కౌన్సిలింగ్ నిర్వహించాలని స్థానిక ఎంఆర్‌సి వద్ద శనివారం నిరసన తెలిపారు. ప్రస్తుతం జరుగుతున్న బదిలీలు, స్కూల్ రీస్ట్రక్చర్‌లో భాగంగా ఐక్య ఉపాధ్యాయ సంఘాలతో చర్చల్లో సందర్భంగా సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులకు మాన్యువల్ కౌన్సిలింగ్ నిర్వహిస్తామని, ప్రస్తుతం బదిలీల్లో వెబ్ కౌన్సిలింగ్ నిర్వహించడాన్ని ఉపాధ్యాయ సంఘాల ఐక్య వేదిక తీవ్రంగా ఖండిస్తుందని పేర్కొన్నారు. ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక ఎన్నో ప్రతిపాదనలు పెట్టినప్పటికీ ఒక్క ప్రతిపాధన కూడా ఒప్పుకోకపోగా చివరికి ఒప్పుకున్న సెకండ్ గ్రేడు ఉపాధ్యాయుల మాన్యువల్ కౌన్సిలింగ్ కూడా అమలు చేయడం లేదని పేర్కొన్నారు. దీనివల్ల ఉపాధ్యాయులు తీవ్రమైన ఆందోళనకు గురవుతున్నారు. ఈ విషయాన్ని ప్రభుత్వం ఆలోచించి 700 మంది ఉపాధ్యాయులకు మాన్యువల్ కౌన్సిలింగ్ నిర్వహించకపోతే పాత జిల్లాల్లో డిఈఓ కార్యాలయం ముట్టడి చేస్తామని ఉపాధ్యాయ సంఘాల నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘం నాయకులు బేతాళ పూర్ణచంద్రరావు, మలాది నాగరాజు, కందులు గంగాధర్, జగన్నాథం బాబురావు, కరి రామయ్య, చప్పుడు కేశవరావు, కోవి మల్లికార్జునరావు పాల్గొన్నారు.


అద్దంకి ఎంఆర్‌సి వద్ద నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు


విద్యార్థులను అభినందిస్తున్న యాజమాన్యం

గోవిందాంబికా విద్యార్థుల ప్రభంజనం

ప్రజాశక్తి - అద్దంకి

ఇంటర్మీడియట్ బెటర్మెంట్ పరీక్ష ఫలితాల్లో స్థానిక గోవిందాంబికా కాలేజీ విద్యార్థులు అత్యుత్తమ మార్కులతో విజయ ప్రభంజనం సృష్టించారని కరస్పాండెంట్ బి నాగార్జున తెలిపారు. శనివారం ప్రకటించిన పరీక్ష ఫలితాల్లో తమ కళాశాల విద్యార్థి చిలక ఝాన్సీ బైపీసీ విభాగంలో 440కి 432 మార్కులు సాధించి టౌన్ ఫస్ట్ నిలిచినట్లు తెలిపారు. ఎంపీసీ విభాగంలో బాలం నిహారిక 470కి 462 మార్కులతో టౌన్ సెకండ్ సాధించినట్లు చెప్పారు. ఎంపీసీ విభాగంలో 22 మంది విద్యార్థులు 400కు పైగా మార్పులు సాధించారని డైరెక్టర్ రామానాయుడు తెలిపారు. ఈ విద్యా సంవత్సరం నుండి కామాక్షి క్యాంపస్‌లో ఎంసెట్, జెఇఇ మెయిన్స్, నీట్ ప్రత్యేక తరగతులు ప్రారంభిస్తున్నట్లు ప్రిన్సిపల్ వెంకట్రావు తెలిపారు. అనంతరం ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను కళాశాల యాజమాన్యం అభినందించారు. కార్యక్రమంలో విద్యార్థుల తోపాటు అధ్యాపక బృందం పాల్గొన్నారు.

ఇంటర్ బెటర్మెంట్‌లో సత్తా చాటిన తేజస్విన్

ప్రజాశక్తి - బాపట్ల


విద్యార్థి తేజస్విన్

ఇంటర్ బెటర్మెంట్ పరీక్షల్లో స్థానిక శ్రీ చైతన్య కళాశాల విద్యార్థి తేజస్విన్ 466 మార్కులు సాధించినట్లు కళాశాల నిర్వాహకులు తెలిపారు. ఇంటర్ పరీక్షల్లో తేజస్విన్ ఊహించని స్థాయిలో మార్కులు రాకపోవడంతో తిరిగి బెటర్మెంట్ పరీక్ష రాశాడు. ఎంపిసి మొదటి సంవత్సరం విద్యార్థి నల్లపాటి తేజస్విన్ సాధారణ పరీక్షలు రాయగా 462 మార్కులు వచ్చాయి. తను అనుకున్న లక్ష్యం నెరవేరకపోవడంతో మళ్లీ బెటర్ మెంట్ పరీక్షలు రాయగా 466 మార్కులు సాధించి కాలేజీ మొదటి స్థానంలో నిలిచాడు. కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు అతన్ని అభినందించారు.


రోటరీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సిమెంట్ బల్లలు

రోటరీ ఆధ్వర్యంలో సిమెంటు బల్లలు ఏర్పాటు

ప్రజాశక్తి - అద్దంకి

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రకాశం బాలికల ఉన్నత పాఠశాల, మాధవస్వామి గుడి దగ్గర, దత్త గుడి దగ్గర, బాల ఆంజనేయస్వామి గుడి దగ్గర, సింగరకొండ కాకతీయ సేవా సత్రం దగ్గర సిమెంట్ బల్లలు శనివారం ఏర్పాటు చేశారు. పొట్టి వెంకట శివరావు(శివ) తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం నాలుగు బల్లలు, మలాది శ్రీనివాసరావు ఒక బల్ల, బాచిన శివ ధర పూర్ణచంద్రరావు ఒక బల్ల ఏర్పాటు చేశారు. ప్రజల సౌకర్యార్థం రోటరీ సేవా కార్యక్రమాలను కొనసాగిస్తుందని అన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రోటరీ అధ్యక్షులు చప్పిడి వీరయ్య, సెక్రెటరీ చండూరి మురళీ సుధాకరరావు, ట్రెజరర్ మలాది శ్రీనివాసరావు, ఎజి మహమ్మద్ రఫీ, సందిరెడ్డి శ్రీనివాసరావు, బాచిన పూర్ణచంద్రరావు, అంజాద్ భాష పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేషస్పందన

ప్రజాశక్తి - పంగులూరు

మండలంలోని బూదవాడలో గొట్టిపాటి యువ సేన ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేసిన ఉచిత మెగా శిబిరానికి విశేష స్పందన లభించింది. వైద్య శిభిరంలో 100 మంది హాజరైనట్లు నిర్వాహకులు తెలిపారు. జెడ్‌పి ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించిన వైద్య శిబిరంలో ఎముకలు, కీళ్ళు, షుగర్, బీపీ, కంటికి సంబంధించిన పరీక్షలు ఉచితంగా చేసి అవసరమైన వారికి మందులు ఉచితంగా ఇచ్చారు. డాక్టర్ టి వెంకటేష్, డాక్టర్ ముద్దాన సతీష్ కుమార్, డాక్టర్ జి అమూల్య, హాస్పటల్ సిబ్బంది పరీక్షలు చేశారు. ఎముకలు, కీళ్ల విభాగంలో 20మంది, షుగరు, ఈసీజి, బీపీలో 60 మంది, కంటి విభాగంలో 20 మందికి పరీక్షలు నిర్వహించి మందులు ఇచ్చారు. ఈ సందర్భంగా హాస్పటల్ డాక్టర్ల బృందం మాట్లాడుతూ గ్రామీణ పరిసరాల్లో తమ చెరుకూరి ఆస్పటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.


వైద్య పరీక్షిస్తున్న వైద్యురాలు

ఎస్సీ,ఎస్టీల సంక్షేమంపై 'కూటమి' వివక్ష

ప్రజాశక్తి - కొరిశపాడు


ఎస్సీ, ఎస్టీ సంక్షేమంపై కూటమి ప్రభుత్వం కుల వివక్ష చూపిస్తుందని దళిత హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షులు నీలం నాగేంద్రరావు ధ్వజమెత్తారు. స్థానిక తహశీల్దారు కార్యాలయం వద్ద స్థానిక దళితులతో కలిసి ప్రజాగలం పేరుట కూటమి పార్టీల ఉమ్మడి మేనిఫెస్టోపై ఆయన మాట్లాడారు. తాము అధికారంలోకి వస్తే ఎస్సీ, ఎస్టీలకు 50ఏళ్లకే పెన్షన్ మంజూరు చేస్తామని ఇచ్చిన హామీ ప్రకారం ఒకరికి కూడా పింఛను మంజూరు చేయలేదని అన్నారు. సంబంధిత జిఒ కూడా విడుదల చేయలేదని అన్నారు. సబ్ ప్లాన్ నిధులు ఎస్సీ, ఎస్టీల అభివృద్ధికి ఖర్చు చేస్తామని చెప్పి సబ్ ప్లాన్ నిధులు సమీక్ష కూడా ప్రభుత్వం ఇంతవరకు చేయలేదని అన్నారు. ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులను కూటమి ప్రభుత్వం ఇతర కులాల అభివృద్ధికి దారు మళ్లిస్తుందని అన్నారు. జగన్ ప్రభుత్వం రద్దు చేసిన ఎస్సీ, ఎస్టీ సంక్షేమ పథకాలు పునరిద్దరిస్తామని ఎన్నికల మానిఫెస్టోలో చెప్పి ఏడాదైనా అమలకు నిధులు మంజూరు చేయలేదని అన్నారు. డీఎస్సీ నోటిఫికేషన్ నిరుద్యోగుల కోసం ప్రకటించిన కూటమి ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టుల నోటిఫికేషన్ మాత్రం నేటికీ ఇవ్వలేదని అన్నారు. గతేడాది డిసెంబర్ 24న మాల, మాదిగ, రెల్లీ కులాలకు ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రూ.341 కోట్లు మంజూరు చేసినట్లు ఉత్తర్వులు ఇచ్చారే కానీ ఆర్థిక సంవత్సరం 2024 - 25 మార్చితో ముగిసినప్పటికీ ఒక రూపాయి కూడా సబ్సిడీ రుణాలు ఇవ్వలేదని అన్నారు. కానీ బీసీ కార్పొరేషన్ ద్వారా బీసీలతో పాటు ఈడబ్ల్యూఎస్ పేరుతో తమ పార్టీకి చెందిన అగ్రకుల వారికి రూ.వందల కోట్లు ఈ ఏడాది ఏప్రిల్ 11న పూలే జయంతి రోజున పంచి పెట్టారని అన్నారు. రానున్న 2025-26 యాక్షన్ ప్లాన్ పేరుతో బీసీలు, అగ్రకులాలకు 60ఏళ్ల వయసు నిర్ణయిస్తూ ఎస్సీ, ఎస్టీలకు మాత్రం పదేళ్లు తగ్గించి 50ఏళ్లుగా సబ్సిడీ రుణాల మంజూరు వయసు నిర్ణయించడం ఎస్సీ, ఎస్టీలపై ఆర్థిక అణచివేతకు నిదర్శనం అన్నారు. ఈ సంవత్సరం ఎస్సీ, ఎస్టీ నిరుద్యోగులకు బ్యాంకులతో సంబంధం లేకుండా కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసే ఎన్‌ఎస్‌ఎఫ్‌డిసి ద్వారా ఇన్నోవా, ట్రాక్టర్లు, కార్లు వంటి రుణాలకు కూడా దిక్కులేదని అన్నారు. కేంద్రం తన వాటా సగం మంజూరు చేస్తే అట్రాసిటీ కేసుల్లో బాధితులకు ఇచ్చే రిలీఫ్ రూ.90కోట్లు రాలేదన్నారు. కార్యక్రమంలో అంజయ్య, కాకుమాని రవి, దళిత వేదిక కన్వీ నర్ కసుకుర్తి ఆమెన్ రాజు, వెలమల శ్రీనివాసరావు, యోగయ్య పాల్గొన్నారు.


ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న ఎం ఆంజనేయులు

బకాయిలు వెంటనే చెల్లించాలి

ప్రజాశక్తి - మేదరమెట్ల

పెండింగ్లో ఉన్న బకాయిలు ఉపాధి హామీ కూలీలకు వెంటనే చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఎం ఆంజనేయులు అన్నారు. దైవాలరావురు గ్రామంలో ఉపాధి హామీ కూలీలతో శనివారం మాట్లాడుతూ ఇప్పటివరకు బకాయి ఉన్న కూలీని వెంటనే ఇవ్వాలని కోరారు. పే స్లిప్పులు ఇవ్వాలని, కూలీలకు రావాల్సిన టెంటూ, పలుగు, పార, మజ్జిగ వంటివి ప్రభుత్వం పూర్తిగా మరచిపోయిందని అన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఉపాధి హామీ పథకాన్ని రక్షించుకోవాల్సిన అవసరం మనకు ఎంతైనా ఉందని అన్నారు. ప్రభుత్వ అధికారులతో పోట్లాడి కూలీలకు రావాల్సిన వాటిని, అడిగి తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. కార్యక్రమంలో స్థానిక ఉపాధి హామీ మెట్లు, కూలీలు పాల్గొన్నారు.


వధూవరులను ఆశీర్వదిస్తున్న అశోక్ బాబు

వధూవరులకు అశోక్‌బాబు ఆశీర్వాదం

ప్రజాశక్తి - భట్టిప్రోలు

మండలంలోని కోనేటిపురంకు చెందిన వైసిపి నాయకులు బుస్సా వెంకటకృష్ణ రామారావు, సుజాత కుమారుడు బుస్సా మురళికృష్ణ ప్రదీప్, ధీన మౌనిక వివాహం శనివారం రేపల్లె పట్టణంలోని ఎంసిఎ ఫంక్షన్ హాలులో ఘనంగా నిర్వహించారు. వివాహ వేడుకలకు వైసిపి రాష్ట్ర అధికార ప్రతినిధి, ఇన్‌ఛార్జి వరికూటి అశోక్ బాబు పాల్గొని నూతన వధూ, వరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో వైసిపి మండల, గ్రామ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాలు విడుదల

ప్రకాశం జిల్లాకు 15 స్థానం

ప్రజాశక్తి -ఒంగోలు సిటీ

ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ ఫలితాలు శనివారం విడుదల చేశారు. ఈ ఫలితాల్లో ప్రకాశం జిల్లాకు 15వ స్థానం లభించింది. జూనియర్ ఇంటర్మీడియట్ పరీక్షలకు మొత్తం విద్యార్థులు 6,368 హాజరు కాగా 2421 ఉత్తీర్ణులై 38.02 శాతం సాధించినట్లు ఆర్ఐఒ ఎస్ సైమన్ విక్టర్ తెలిపారు. జూనియర్ ఇంటర్ జనరల్ పరీక్షలకు 5999 మంది హాజరు కాగా 2,248 మంది పాసై (37.47శాతం) ఉత్తీర్ణత సాధించారు. జూనియర్ ఇంటర్ ఒకేషనల్ పరీక్షకు 369 మంది హాజరు కాగా 173 మంది (46.88శాతం) ఉత్తీర్ణులయ్యారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో 977 మంది హాజరు కాగా 412 మంది (42.17శాతం) ఉత్తీర్ణత సాధించారు. కొండపి జూనియర్ కళాశాలలో 90.91శాతం కొమరోలులో 83.33, ఉప్పుగుండూరు 83.33 శాతం ఉత్తీర్ణత సాధించారు. జిల్లాలోని మోడల్ కళాశాలలలో 138 మంది హాజరు కాగా 60 మంది ఉత్తీర్ణత (43.38) సాధించారు. దోర్నాల మోడల్ స్కూల్, రాచర్ల మోడల్ స్కూల్స్‌లో 75 శాతం ఉత్తీర్ణత సాధించారు. హైస్కూల్ ప్లస్ కళాశాలల్లో 130 మంది హాజరు కాగా 42 మంది ఉత్తీర్ణత (32.31శాతం) హెచ్.నిడమనూరు 92.31శాతం , పాకలలో 66.67 శాతం ఉత్తీర్ణత సాధించారు. కేజీబీవీ కళాశాలల్లో 290 మంది విద్యార్థులకు గాను 156 మంది (53.79శాతం) ఉత్తీర్ణులయ్యారు. తర్లపాడు, దొనకొండ కేజీబీవీలో 100 శాతం ఉత్తీర్ణత సాధించారు. సంక్షేమ జూనియర్ కళాశాలల్లో 124 మంది పరీక్షలకు హాజరు కాగా 54 మంది (43.55శాతం)ఉత్తీర్ణత సాధించారు. కొండపి, కంభం, దర్శి అర్ధవీడు కళాశాలలు 100 ఉత్తీర్ణత సాధించాయి. ఎయిడెడ్ కళాశాలలో 54 మంది విద్యార్థులకు 13 మంది (24.07 శాతం) ఉత్తీర్ణత సాధించారు. ప్రైవేట్ కళాశాలలో 4,55 మంది విద్యార్థులు హాజరు కాగా 1684 మంది (36.17శాతం) ఉత్తీర్ణత సాధించారు.

సీనియర్ ఇంటర్ ఫలితాల్లో...

సీనియర్ ఇంటర్ పరీక్షలకు మొత్తం 4833మంది హాజరు కాగా 2781 (57.54శాతం) ఉత్తీర్ణత సాధించారు. జనరల్ ఇంటర్మీడియట్‌లో 4266 మంది పరీక్షకు హాజరు కాగా 2433 మంది(57.03శాతం) ఉత్తీర్ణత సాధించారు. ఇంటర్ ఒకేషనల్ విభాగంలో 567 మంది హాజరు కాగా 348 మంది (61.38 శాత) ఉత్తీర్ణత సాధించారు. సీనియర్ ఇంటర్‌లో ప్రకాశం జిల్లాకు 15వ స్థానం దక్కింది. ప్రభుత్వ కళాశాలల్లో 700 మంది పరీక్షలకు హాజరు కాగా 428 మంది (61.1శాతం) ఉత్తీర్ణత సాధించారు. కొండపి,తాళ్లూరు, ప్రభుత్వ కళాశాలల్లో నూరు శాతం ఉత్తీర్ణత సాధించారు. మోడల్ జూనియర్ కళాశాలలో 103 మంది పరీక్షలకు హాజరు కాగా 67 మంది (65.05శాతం) ఉత్తిర్ణత సాధించారు. హైస్కూల్ ప్లస్ కళాశాలల్లో 63 మంది హాజరు కాగా 40 మంది (63.49 శాతం) ఉత్తీర్ణత సాధించారు. పాకల, హెచ్. నిడమనూరు ఉప్పలపాడు హైస్కూల్ కళాశాలల్లో నూరు శాతం ఉత్తీర్ణత సాధించారు. కేజీబీవీ కళాశాలల్లో 104 మంది విద్యార్థులు హాజరు కాగా 59 మంది(56.68శాతం) ఉత్తీర్ణత చెందారు. పెద్దారవీడు, దోర్నాల, సిఎస్‌పు దర్శి,బేస్తవారిపేట, పిసిపల్లి, ముండ్లమూరు,రాచర్ల కేజీబీవి నూరు శాతం ఉత్తీర్ణత సాధించారు. ఎయిడెడ్ కళాశాలల్లో 31 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా 25 మంది (80.65శాతం) ఉత్తీర్ణత సాధించారు. ప్రైవేట్ కళాశాలల్లో 3796 మంది హాజరు కాగా 2143మంది (56.45శాతం) ఉత్తీర్ణత సాధించినట్లు ఆర్ఐఒ సైమన్ విక్టర్ తెలిపారు.

రాష్ట్ర మహాసభల ఆహ్వాన సంఘం కరపత్రం ఆవిష్కరణ

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ

ప్రజా సమస్యలే ఎజెండాగా, సమస్యల పరిష్కారమే ఊపిరిగా ఉద్యమాలు నిర్మించి పేద ప్రజలకు ఎల్లవేళలు అండగా నిలిచే పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ అని 28వ రాష్ట్ర మహాసభల ఆహ్వాన సంఘం అధ్యక్షుడు, సిపిఐ సీనియర్ రాష్ట్ర నాయకుడు నల్లూరి వెంకటేశ్వర్లు తెలిపారు. ఒంగోలులోని మల్లయ్య లింగం భవనంలో సిపిఐ 28వ రాష్ట్ర మహాసభల ఆహ్వాన సంఘం కరపత్రాన్ని శనివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో నల్లూరి మాట్లాడుతూ 100 సంవత్సరాల చరిత్ర కలిగిన సిపిఐ ఒంగోలులో తొలిసారిగా రాష్ట్ర మహాసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర మహాసభల నిర్వహణకు జిల్లాలోని అన్ని వర్గాల ప్రజలు తమ సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఆహ్వాన సంఘం ముఖ్య సలహాదారులు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు గుజ్జుల ఈశ్వరయ్య మాట్లాడుతూ ఆగస్టు 20 నుంచి 25 వరకూ రాష్ట్ర మహాసభలు నిర్వహించున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా భారీ ర్యాలీ, బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహాసభల ఆహ్వాన సంఘం ప్రధాన కార్యదర్శి, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్. నారాయణ,సిపిఐ రాష్ట్ర మహాసభల ఆహ్వాన సంఘం కార్యనిర్వాహక కార్యదర్శి ఆర్.వెంకట్రావు, కోశాధికారి కె. వెంకటేశ్వర్లు, కార్యదర్శులు కె వీరారెడ్డి, శ్రీరామ్ శ్రీనివాసులు,గద్దల రవి, నూనె జగన్మోహనరావు, ఆది నారాయణ, బోడపాటి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



కరపత్రం ఆవిష్కరిస్తున్న నాయకులు

నాటడం సరే.. నరకటం ఆపండి

సాని చెరువులో మర్రిచెట్లు నరికివేత

ఆందోళనలో పశు పోషకాలు

అమలు కానీ వాల్టా చట్టం

ప్రజాశక్తి-పీసీపల్లి

నాటడం సరే.. ముందు నరకడం ఆపాలంటూ మండల వాసులు కోరుతున్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవ సందర్భంగా కోటిమొక్కలు నాటాలని రాష్ట్ర ప్రభుత్వ పిలుపునిచ్చింది. కానీ పీసీపల్లి మండలంలో మాత్రం అవేమి అమలు జరగటం లేదు. సాని చెరువులో చెట్లు నరకటంతో పోషకులు ఆందోళన చెందుతున్నారు. వెంగలాయపల్లి, దివాకర పల్లికి తూర్పు వైపున రెండు కిలోమీటర్ల దూరంలో సానిచెరువు ఉంది. ఈ చెరువులో సంవత్సరం పొడవునా నీరు ఉంటుంది. వేసవిలో నీరు లేని సమయంలో బోరు వేసి చుట్టూ తొట్టి కట్టి పశువులకు జీవాలకు నీరు నింపేందుకు ప్రభుత్వం ఒక బోరును కూడా ఏర్పాటు చేసింది. దీంతో వెంగలాయపల్లి, దివాకరపురం, మిట్టపల్లి చెందిన పశువులు మేపుకునే వారంతా ఇక్కడే ఉంటారు. పొలాల్లో ఫైర్లు వేసినప్పుడు కూడా ఈ చెరువు ఆవరణలో సుమారు 1500 పశువులు, జీవాలతో నిత్యం ఇక్కడే ఉంటారు. చెరువులో ఆరు పెద్ద మర్రిచెట్లు ఉన్నాయి. ఇంతటి ప్రాధాన్యం ఉన్న సాని చెరువుల్లో కొందరు రెండు చెట్లు నరికి వేశారు. ప్రభుత్వ భూమి కావటం, రిజర్వ్ ఫారెస్ట్ కాకపోవటంతో ఎవరూ పట్టించుకోరు అనే ఉద్దేశ్యంతో కర్ర వ్యాపారులు ఈవైపు కన్నేశారు. కొన్ని రోజుల క్రితం పట్టపగలు మిషన్లు తీసుకువచ్చి రెండు మర్రిచెట్లను నరికి వేశారు. చప్పుడు రావటం ఎత్తుగా ఉన్న కొమ్మలు పడిపోవటంతో చుట్టుపక్కల ఉన్న పశు పోషకాలు పడిపోయిన చెట్ల వద్దకు వచ్చారు. అటవీ అధికారులకు తెలియపరుస్తామని చెప్పటంతో, నరికిన కొమ్మలను మొద్దులను వదిలివెళ్ళారు. ఆ తర్వాత రాత్రిపూట ట్రాక్టర్‌లలో తీసుకుపోయారు. జన బాహుల్యానికి దూరంగా ఉండే ప్రదేశాల్లో ఇలా పట్టపగలే చెట్లను నరికేస్తున్నారు. అటవీ శాఖ అధికారులు చర్యలు తీసుకుంటారని ఇలాంటి ప్రాంతాన్ని ఎంచుకొని చెట్లు నరుకుతున్నారు. ఫిబ్రవరి నెలలో వాటర్ షెడ్ పథకాన్ని రాష్ట్ర స్థాయిలో మండలంలోని జంగాలపల్లిలో ప్రారంభించారు. ఆ సందర్భంగా చెట్లను నరక వద్దంటూ చెట్లను కాపాడాలని జిల్లా కలెక్టర్ తమీం అన్సారియా మాట్లాడారు. అవేమీ పట్టించుకోకుండా మరుసటి రోజు నుంచి పిసిపల్లి మండల కేంద్రంలో బహిరంగంగా చెట్లను నరికి తరలిస్తూనే ఉన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం మరియు వనమహోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం కోటి మొక్కలు నాటాలని పిలుపునిచ్చింది. అవేమి ఇక్కడ అమలు జరగవు. కర్ర వ్యాపారస్తులు మాత్రం పచ్చని చెట్టు కనపడితే ఏదో ఒక రూపంలో నరికి వేస్తూనే ఉంటారు. చెట్లు కొమ్మలు కూడా నరికి వేస్తుంటారు. సాని చెరువులో ఇక్కడ రెండు పెద్ద మర్రిచెట్లను నరికి వేశారు. నరికి వేసిన రెండు చెట్ల కింద సుమారు 1,000 పశువులు వుండేందుకు అనువుగా ఉంటుంది. వర్షాకాలంలో చెట్ల కింద పోషకులు మరియు జీవాలు కూడా ఉంటాయి. వేసవికాలంలో గ్రామాల్లో ఉండటం కంటే పశువులను తోలుకెళ్ళి మర్రిచెట్ల కింద చల్లని ప్రదేశంలో విశ్రాంతి తీసుకోవచ్చని కూడా పోతున్నారు. ఇక్కడ మరో నాలుగు మర్రిచెట్లు కూడా ఉన్నాయి. చుట్టుపక్కల వారు మిగిలిన నాలుగు చెట్లను కాపాడాలని కోరుకుంటున్నారు.



సాని చెరువులో దుండగులు నరికిన మర్రిచెట్టు

నేడు డిఇఒ కార్యాలయ ముట్టడి

ఉపాధ్యాయ సంఘాల ఐక్య వేదిక

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ

రాష్ట్ర విద్యాశాఖ ఇచ్చిన హామీ ప్రకారం సెకండరీ గ్రేడ్ పండిట్స్, పిఇటిలకు మాన్యువల్ కౌన్సిలింగ్ నిర్వహించాలని డిమాండ్ చేస్తూ ఆదివారం డిఇఒ కార్యాలయం ముట్టడించనున్నట్లు ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక శనివారం ఓ ప్రకటనలో తెలిపింది.2025 సంవత్సరం బదిలీల కౌన్సిలింగ్‌కు సంబంధించి ఎస్‌జిటి,పిఇటి, పండిట్స్‌కు మానువల్ ప్రక్రియ ద్వారా నిర్వహించాల్సి ఉందన్నారు. అయితే రాష్ట్ర విద్యా శాఖ ఆన్‌లైన్ పద్ధతిలో నిర్వహించేందుకు అన్ని జిల్లాల విద్యా శాఖాధికారులతో శనివారం వెబెక్స్ మీటింగ్ నిర్వహించినట్లు తెలిపారు. వెబ్ ఆప్షన్స్ పెట్టుకోవాలని ఉపాధ్యాయులపై ఒత్తిడి పెంచినట్లు వారు ఆరోపించారు. దీన్ని నిరసిస్తూ ఎంఇఒ కార్యాలయాలు ఎదుట ఉపాధ్యాయులు శనివారం నిరసన చేపట్టినట్లు వారు పేర్కొన్నారు. బదిలీ ప్రక్రియ ప్రారంభం నుంచి మాన్యువల్ కౌన్సిలింగ్ చేపడతామని చెబుతూ చివరి నిమిషంలో అన్ లైన్ ప్రక్రియను తెరపైకి తేవడం అప్రజాస్వామికమన్నారు. పూటకొక ఉత్తర్వులు, గంటకొక మార్పుతో విద్యాశాఖ ఇటు ఉపాధ్యాయులను అటు అధికారులను ఆందోళన కు గురిచేస్తున్నట్లు ఆరోపించారు. రాష్ట్ర విద్యా శాఖ ఇచ్చిన హామీ మేరకు ఎస్‌జిటి,పిఇటి, పండిట్స్ కు మానువల్ ప్రక్రియ ద్వారా బదిలీలు చేపట్టాలని డిమాండ్ చేశారు. లేని పక్షాన ఆందోళన ఉదతం చేస్తామని వారు హెచ్చరించారు. ఆ మేరకు ఆర్ జెడికి లేఖ రాసినట్లు ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక నాయకులు యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు షేక్ అబ్దుల్ హై, డి.వీరాంజనేయులు, ఉపాధ్యక్షుడు ఎస్ రవి, ఎపిటిఎఫ్ 257 జిల్లా అధ్యక్షుడు వి. జనార్ధన్ రావు, ఎపిటిఎఫ్ 1938 అధ్యక్ష కార్యదర్శులు పివి.సుబ్బారావు, బి.వెంకటరావు పేర్కొన్నారు.

సబ్సిడీపై విత్తనాలు అందజేయాలి

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ

ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనందున రైతులకు మరియు కౌలు రైతులకు 90శాతం సబ్సిడీపై నాణ్యమైన విత్తనాలు అందజేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గుజ్జుల ఈశ్వరయ్య తెలిపారు. ఒంగోలులోని మల్లయ్య లింగం భవన్‌లో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో శనివారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఈశ్వరయ్య మాట్లాడుతూ రైతులు, కౌలు రైతులు ఇబ్బందులు పడకుండా కూటమి ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు జూన్ 9న మండల కార్యాలయాల దగ్గర ధర్నా చేపట్టనున్నట్లు తెలిపారు. కౌలు రైతులందరికీ గుర్తింపు కార్డులు ఇవ్వాలని, కౌలు రైతులకు బ్యాంకులు పంట రుణాలు స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు రైతులకు ఇచ్చిన హామీ మేరకు అన్నదాత సుఖీభవ పథకం కింద రూ.20 వేల రూపాయలు వెంటనే రైతుల ఖాతాలో జమ చేయాలన్నారు. ఈ సమావేశంలోఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వి. హనుమారెడ్డి కె.వీరారెడ్డి, రైతు నాయకులు చెరుకూరి వాసు, గద్దల రవి పాల్గొన్నారు .

పేదలకు అన్నదానం

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ : సాటి వారికి సహాయపడుతూ సర్వ మానవాళి పట్ల, సర్వ ప్రాణుల పట్ల దయ,కరుణ,ప్రేమతో మెలగాలన్నదే మహ్మద్ ప్రవక్త చెప్పిన బక్రీద్ సందేశమని, దీన్ని అందరూ ఆచరణలో పెట్టాలని నటుడు, రచయిత డాక్టర్ మొగిలి దేవ తెలిపారు. బక్రీద్ పండుగ సందర్భంగా మంగమ్మ కాలేజీ పూర్వ అధ్యాపకుడు మహ్మద్ సలేహ, పాలిటెక్నిక్ కళాశాల పూర్వ అధ్యాపకులు జయలక్ష్మి దంపతుల జ్ఞాపకార్థం వారి కుమార్తె నజ్నెన్ శివం ఫౌండేషన్ ఆధ్వర్యంలో నగరంలోని పలు ప్రాంతాల్లో 500 మందికి పైగా అనాథలకు అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఒంగోలు నగర అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మారెళ్ళ సుబ్బారావు మాట్లాడుతూ బక్రీద్ రోజున తమ తల్లిదండ్రుల జ్ఞాపకార్థం నజ్నెన్ అనాథలకు, పేదలకు అన్నదానం చేపట్టడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సేవ్ ది యానిమల్ ఫౌండేషన్ చైర్మన్ దివ్యపాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో బక్రీద్ ప్రార్థనలు



బాపట్ల అక్బర్‌పేట ఈద్గాలో ముస్లింల నమాజు



పర్చూరులో బక్రీద్ ప్రార్థనలలో పాల్గొన్న ముస్లింలు

ప్రజాశక్తి - బాపట్ల

శాంతి, సామరస్యానికి ప్రతీకైన బక్రీద్ పండుగను ముస్లిం సోదరులు అత్యంత వైభవంగా శనివారం నిర్వహించారు. పట్టణంలోని ఇస్లాంపేట, అక్బర్‌పేట ఈద్గాల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. బక్రీద్ విశిష్టతను మత పెద్దలు వివరించారు. నమాజ్‌కు అవసరమైన ఏర్పాట్లను అంజుమన్ ఏ ఇస్లామియా కమిటీ చేసింది.

పర్చూరు : మండలంలోని ముస్లిం సోదరులు బక్రీద్ పండుగను శనివారం అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. పిల్లలు, పెద్దలు కొత్త దుస్తులు ధరించి బక్రీద్ పండుగ సందర్భంగా ఈద్గాలు, మసీదులకు చేరుకొని ప్రత్యేక ప్రార్థన నిర్వహించారు. ముస్లిం సోదరులు ఎఎంసి మార్కెట్ యార్డు వద్ద ప్రత్యేక ప్రార్థన నిర్వహించారు. వీరి చేత మసీద్ ఇమామ్ షాహిద్ ప్రార్థన జరిపించి దువా అందజేశారు. పండుగ ప్రత్యేకతను వివరించారు. ఈ సందర్భంగా పర్చూరులో నిర్మాణం చేపడుతున్న కొత్త మసీదు నిర్మాణానికి దాతలు ఆర్థిక సహాయం అందించాలని ఇమామ్ కోరారు. పేదలకు దానధర్మాలు చేశారు. బంధుమిత్రులకు మిఠాయిలు పంచిపెట్టారు. స్థానిక ఇందిరాకాలనీ మసీదు, ఉప్పుటూరు, నూతలపాడు, గర్నెపూడి, నాగులపాలెం, చెరుకూరు, పోతుకట్ల గ్రామాల మసీదులు, ఈద్గాల వద్ద ప్రార్థనలు నిర్వహించి ఆనందంగా గడిపారు.

యద్దనపూడి : మండలంలోని యద్దనపూడి, జాగర్లమూడి, పోలూరు, పూనూరు, గన్నవరం, అనంతవరం గ్రామాల్లో ముస్లిం సోదరులు పవిత్ర బక్రీద్ పండగను ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. ముస్లిం సోదరులు ప్రార్థనలు చేశారు. జాగర్లమూడి ఉన్నత పాఠశాల నందు ప్రార్థనలు చేశారు. మసీదు ఇమామ్ షేక్ గౌస్ ఖురాన్ బక్రీదు ప్రాముఖ్యతను వివరించారు. ఒకరికి ఒకరు బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అనంతవరం మీరావలి, బండి మస్తాన్, మాబు, సైదావలి, జాగర్లమూడి యువకు లు బాజీ, మస్తాన్వలి, కాలేషా మహమ్మద్, మున్నా పాల్గొన్నారు

సంతమాగులూరు : త్యాగాలకు ప్రతీకైన బక్రీద్ పండుగ సందర్భంగా మండలంలోని పుట్టావారిపాలెం, కొమ్మాలపాడు, ఏల్చూరు, కొప్పరం, కామేపల్లి, వెల్లలచెరువు, మిన్నేకల్లు గ్రామాల్లో ముస్లింలు అత్యంత భక్తిశ్రద్ధలతో ఈద్గాల వద్ద ప్రార్థనలు నిర్వహించారు. పుట్టావారిపాలెంలో సర్పంచి సన్నెబోయిన గురు యాదవ్ తండ్రి వెంకటేశ్వర్లు రు.2.50 లక్షల సొంత నిధులతో ఈద్గా ఏర్పాటు చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఈద్గా నిర్మాణదాత సన్నె బోయిన వెంకటేశ్వర్లు, స్థల దాత షేక్ మస్తాన్ వలి, సుపియాను ముస్లిం కమిటీ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సర్పంచుల సంఘం మండల అధ్యక్షులు సన్నెబోయిన గురు యాదవ్, మాజీ ఎంపీపీ సన్నెబోయిన ఏడుకొండలు ముస్లిం యువతకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. ఉపసర్పంచి షేక్ మాబు సైదా పాల్గొన్నారు.

ఇంకొల్లు : బక్రీద్ పండుగ సందర్భంగా ముస్లిం సోదరులు భక్తి శ్రద్ధలతో ప్రార్థనలు చేశారు. ఒకరికి ఒకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. మత పెద్దలు బక్రీద్ ప్రాధాన్యత వివరించారు.

వేటపాలెం : త్యాగనిరతి చాటిచెప్పే పవిత్రమైన ఈ బక్రీద్ పండుగ వేడుకను చిన్నపిల్లలు పెద్దవారు, ఒకరి నొకరు పరస్పరం ఆలింగనం చేసుకొని సోదర భావంతో సంతోషం వ్యక్తం చేశారు. వేటపాలెం అక్సా మసీద్, చిన్న బజార్ ముబారక్ మసీద్, ఆబాద్ నగర్ మసీదుల్లో ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో వేటపాలెం పెద్ద మసీద్ ఇమామ్, షేక్ అనాస్ సాహెబ్, షేక్ నాయబ్ రసూల్, షేక్ రఫీ, ముత్వల్లి షాబుద్దీన్, షేక్ షమీం పాల్గొన్నారు.

రేపల్లె : బక్రీద్ పండుగ సందర్భంగా పట్టణంలోని ఈద్గా మైదానంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ముస్లిం పెద్దలు మాట్లాడుతూ అల్లాహ్ ఇబ్రాహీంను పరీక్షించేందుకు తను ప్రేమించిన కుమారుడు ఇస్మాయిల్‌ను త్యాగం చేయమని ఆదేశించారు. ఇబ్రాహీం ప్రవక్త తన కుమారుడిని త్యాగం చేయడానికి సిద్ధమయ్యాడు. అల్లాహ్ ఆయన విధేయతను మెచ్చి చివరిగా ఒక గొర్రెని పంపించి తన త్యాగానికి ప్రత్యామ్నాయంగా ఆ జంతువును త్యాగం చెయ్యమని సూచించారు. ఈ సంఘటనను గుర్తుచేసుకుంటు ప్రతిఏటా బక్రీద్ పండుగను జరుపుకుంటారని తెలిపారు. త్యాగం చేసిన మాంసాన్ని మూడు భాగాలుగా పంచుతారు ఒక భాగం కుటుంబానికి, ఒక భాగం స్నేహితులకు, మూడో భాగం పేదలకు. సహకారం, దాతృత్వం, సోదరభావం పెంపొందించుకోవటం ఉద్దేశం అన్నారు. దయా భావాన్ని, త్యాగ స్ఫూర్తిని బోధిస్తుంది.



యద్దనపూడిలో ప్రార్థనలు చేస్తున్న ముస్లిం సోదరులు



రేపల్లెలో ప్రార్థనలు చేస్తున్న ముస్లిం సోదరులు

అంబులెన్స్ ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి - ముండ్లమూరు



మృతి చెందిన వెంకటేష్

మండల కేంద్రమైన ముండ్లమూరులోని తాళ్లూరు రోడ్డులో అంబులెన్స్ వాహనం ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టిన సంఘటన శనివారం జరిగింది. దర్శి వైపు నుండి అద్దంకి వెళుతున్న టిజి 29 టి 4192 ప్రైవేటు అంబులెన్స్ ముండ్లమూరు గ్రామానికి చెందిన తాతపూడి వెంకటేష్ (55) ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టింది. ఈ సంఘటనలో వెంకటేష్‌కు తీవ్ర గాయాలు అయ్యాయి. గాయాలైన క్షతగాత్రున్ని 108లో అద్దంకి ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు ప్రథమ చికిత్స చేసి మెరుగైన చికిత్స కోసం ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. ఓపి రాయించి పరీక్షలు చేస్తుండగా అతను మరణించాడు. వెంకటేష్ మరణించాడన్న వార్త వినగానే భార్య, పిల్లలు, బంధువులు బోరున విలపించారు. వెంకటేష్ మృతితో ఎస్సీ కాలనీలో విషాద ఛాయలు అలుమున్నాయి. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. సంఘటనా స్థలాన్ని ఎస్ఐ కె కమలాకర్ పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎక్సైజ్ సిఐ దివాకర్

సారా నిర్మూలనకు ప్రజలు సహకరించాలి

ప్రజాశక్తి - రేపల్లె

నాటు సార నిర్మూలనకు గ్రామస్తులు సహకరించాలని ప్రొహిబిషన్ ఎక్సైజ్ సిఐ దివాకర్ పేర్కొన్నారు. గుడికాయలంకలో నవోదయ 2.0పై అవగాహన సదస్సు శనివారం నిర్వహించారు. కళాజాత బృంద సభ్యులు నాటికలు, పాటల ద్వారా గ్రామంలో తిరుగుతూ ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రజలకు కరపత్రాలు పంచారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నాటు సారా వల్ల ఎన్నో కుటుంబాలు నాశనం అవుతున్నాయని, భవిష్యత్తు తరాలు నష్టపోతున్నాయని పేర్కొన్నారు. నాటు సారా అరికట్టి ప్రజలందరినీ ఉజ్వల భవిష్యత్తు వైపు నడిపించేందుకు ప్రభుత్వం ఎన్నో చర్యలు చేపట్టిందని చెప్పారు. నాటు సారా తయారు చేయడం ఆపేసిన వారికి ఆర్థికంగా రుణాలు అందించడం, వ్యాపారాలు ప్రారంభించేందుకు సహాయాన్ని అందించడం వంటి చర్యలు తీసుకుంటుందని అన్నారు. నాటు సారా అమ్మే వారికి, కొనేవారికి భవిష్యత్తులో సంక్షేమ పథకాలు లభించే పరిస్థితి ఉండదని చెప్పారు. దీనిని దృష్టిలో పెట్టుకొని నాటు సారా తయారు చేయడం, రవాణా చేయడం, కొనుగోలు చేయడం ఆపేయాలని సూచించారు. ఎక్కువ మొత్తంలో బెల్లం అమ్మి నాటు సారా తయారీకి సహకరిస్తే వారిపై పీడీ చట్టాన్ని అమలు చేస్తామని హెచ్చరించారు. నాటు సారా తయారు చేసేందుకు ఏ విధమైన సహాయ, సహకారాలు అందించిన వారిపై కూడా పీడీ చట్టాన్ని అమలు చేస్తామని పేర్కొన్నారు. నాటు సారా తయారీ, రవాణా, అమ్మకాలపై ఫిర్యాదులను, రాష్ట్ర స్థాయి కంట్రోల్ రూంలో ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నెంబర్ 14405కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చని అన్నారు. నాటు సారా తయారీలో చాలా విషపదార్థాలు ఉంటాయని, దానిని తాగితే చిన్న వయసులోనే పనిచేసే సామర్థ్యాన్ని కోల్పోవడం, కిడ్నీ, లివర్ చెడిపోవడం, 40ఏళ్లలోనే చనిపోవడం వంటి ఎన్నో సమస్యలు ఎదుర్కొంటారని అన్నారు. నాటు సారా వల్ల ఎదుర్కొన్న సమస్యలపై ఒక అంతర్జాతీయ సంస్థ ఇచ్చిన 'లిక్కర్ విడోస్' అనే నివేదిక ప్రకారం ఎంతోమంది ఆడవాళ్లు 30ఏళ్లలోనే తమ భర్తలను కోల్పోతున్నారని అన్నారు. నాటు సారా తయారు చేసే వారి మీద కఠినంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

కష్టపడి చదివి ఉన్నత స్థానాలకు ఎదగాలి

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

చిన్నతనం నుంచి విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థానాలకు ఎదగాలని ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావు పేర్కొన్నారు. ఒంగోలు ఎంఎస్ ఫంక్షన్ హాలులో శనివారం డిజెఆర్ ట్రస్టు ద్వారా నిర్వహించిన టాలెంట్ టెస్ట్‌లో గెలిచిన 100 విద్యార్థులకు స్కాలర్‌షిప్స్, బ్యాగులు, పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజలకు సేవ చేయటం అదృష్టంగా భావిస్తానని తెలిపారు. ఎన్నికల్లో ఎన్నిసార్లు గెలిచినా పేద పిల్లలను ఆదుకోవటంలో ఉన్న సంతృప్తి మరెక్కడ లేదన్నారు. అభివృద్ధి, సంక్షేమం అమలు చేస్తున్నామని, డిజెఆర్ ట్రస్టు స్థాపించి పేదలకు నిర్విరామ సేవలు అదిస్తున్నామన్నారు. నాడు ఒంగోలుకే పరిమితమైన డిజెఆర్ ఆర్ ట్రస్ట్ నేడు రాష్ట్రవ్యాప్తంగా సేవలు విస్తృతం చేసినట్లు తెలిపారు. ట్రస్ట్ ద్వారా వేసవి దృష్ట్యా ఒంగోలులో 25 చలివేంద్రాలు ఏర్పాటు చేసి దాహార్తిని తీరుస్తున్నామన్నారు. పేద ప్రజల కోసం ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించామని అన్నారు. 200 మందికి పైగా చిరు వ్యాపారులకు తోపుడు బండ్లు ఇచ్చామని అన్నారు. పేదలకు గొడుగులు, వృద్ధాశ్రమంలో భోజనాలు, శిశు వైద్యశాల్లో సేవలు వంటి కార్యక్రమాలు ట్రస్ట్ ద్వారా చేపట్టామన్నారు. ప్రతి ఏడాది 100 మంది విద్యార్థులకు ఉచిత చదువు బాధ్యత తీసుకున్నామని అన్నారు. ఎమ్మెల్యే సతీమణి దామచర్ల నాగసత్యలత మాట్లాడుతూ డిజేఆర్ ట్రస్ట్ సేవలు భవిష్యత్తులో ఇంకా విస్తృతం చేయనున్నట్లు చెప్పారు. ప్రతి విద్యార్థి 75 శాతం మార్కులు, 75 శాతం హాజరు ఉండాలని సూచించారు. ట్రస్ట్‌కు సహకరిస్తున్న ప్రతి ఒక్కరికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఎమ్మెల్యే కుమార్తెలు, ట్రస్ట్ డైరెక్టర్లు దామచర్ల అనీషా లక్ష్మి, తనూజ లక్ష్మి మాట్లాడుతూ విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు డిజెఆర్ కొండంత ఆర్థిక భరోసా ఇస్తుందన్నారు. కార్యక్రమంలో శ్రీహర్షిణీ విద్యా సంస్థల అధినేత గోరంట్ల రవికుమార్, ప్రైవేట్, ఉపాధ్యాయులు, నేతలు పాల్గొన్నారు.

యోగాతో మానసిక ప్రశాంతత

ప్రజాశక్తి - పర్చూరు

ఉరుకుల పరుగుల జీవితంలో ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా యోగా చేయడం ద్వారా మానసిక ప్రశాంతత, ఆరోగ్యంగా ఉంచడవచ్చని ఉప్పుటూరు హెూమియో వైద్య నిపుణులు, యోగ పర్యవేక్షకులు, యోగ మాస్టర్ ట్రైనర్ డాక్టర్ డి చంద్రశేఖర్ తెలిపారు. ఉప్పుటూరు వైద్యశాల్లో శనివారం యోగపై ప్రజలకు అవగాహన కల్పించారు. యోగాసనాలు వేయడం ద్వారా దీర్ఘకాలిక శారీరక, మానసిక రుగ్మతలు, వ్యాధులు నయం అవుతాయని తెలిపారు. శ్వాసపై ధ్యాస ఉంచడం ద్వారా ఏకాగ్రత కలుగుతుందని తెలిపారు. వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థినీ విద్యార్థులు, పురప్రజలకు ఈనెల 9నుండి 14వరకు బాపట్ల హైస్కూల్లో జిల్లాస్థాయి యోగా పోటీలు నిర్వహిస్తారని చెప్పారు. జిల్లాస్థాయి, రాష్ట్రస్థాయిలో మంచి ప్రతిభ కనపరిచి మండలానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. దేశంలో అంతకంతకు పెరుగుతున్న కోవిడ్ 19 పట్ల ప్రజలు జాగ్రత్త వహించాలని చెప్పారు.

24 మంది తహశీల్దార్లు బదిలీ

ఉత్తర్వులు జారీ చేసిన కలెక్టర్ తమీం అన్సారియా

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

పరిపాలనా సౌలభ్యం కోసం జిల్లాలోని 24మంది తహశీల్దార్లను బదిలీ చేస్తూ కలెక్టర్ ఎ తమీమ్ అన్సారియా శనివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో 19 మంది తహశీల్దార్లను బదిలీ చేయగా, అడహక్ పదోన్నతిపై ముగ్గురు డిప్యూటీ తహశీల్దార్లను తహశీల్దార్లుగా నియమిస్తూ కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. సెలవులో ఉన్న తర్లుపాడు, పుల్లలచెరువు తహశీల్దార్లు శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లాకు బదిలీ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు.

తహశీల్దారు పేరు	పనిచేస్తున్న స్థానం	బదిలీ అయిన స్థానం
టి.రవి	సింగరాయకొండ	కలెక్టరేట్ సూపరింటెండెంట్
కె.నాగలక్ష్మి	తాళ్ళూరు	కలెక్టరేట్ సూపరింటెండెంట్
సిహెచ్ శ్రీనివాసరావు	కలెక్టరేట్ సూపరింటెండెంట్	స్పెషల్ తహశీల్దార్
డి.శ్రవణ్‌కుమార్	స్పెషల్ తహశీల్దార్	ఒంగోలు ఆర్డీవో ఆఫీస్
బి.దిలీప్‌కుమార్	హెచ్‌ఎంపాడు	మార్కాపురంసబ్‌కలెక్టర్ ఆఫీస్
డి.మంజునాథరెడ్డి	సిఎస్‌పురం	యర్రగొండపాలెం
సిహెచ్ అశోక్‌కుమార్‌రెడ్డి	రాచర్ల	దోర్నాల
కె.సంజీవరావు	ఒంగోలు	తాళ్ళూరు
బి.ఆదిలక్ష్మి	సంతనూతలపాడు	మద్దిపాడు
ఎస్‌ఎల్ నారాయణరెడ్డి	కలెక్టరేట్ సూపరింటెండెంట్	ఎస్‌ఎన్‌పాడు
పి.మధుసూదనరావు	కొత్తపట్నం	ఒంగోలు అర్బన్
కె.శాంతి	దోర్నాల	కొత్తపట్నం
ఎస్.శ్రీనివాసరావు	వివిపాలెం	కొండపి
పి.మురళి	కొండపి	జరుగుమల్లి
బి.జనార్ధన్	జరుగుమల్లి	మర్రిపూడి
సిహెచ్ నాగార్జున రెడ్డి	మార్కాపురం	అర్ధవీడు
ఎస్‌కెఎండి హుస్సేన్	నెల్లూరు	సిఎస్‌పురం
ఎస్‌కె నాగూల్ మీరా	రీన్‌స్టేట్‌మెంట్	హెచ్‌ఎంపాడు
ఎన్.వాసు	ఒంగోలు అర్బన్	వెలిగండ్ల
ఎస్‌కె రఫీ అహ్మద్	డిటి, పెద్దారవీడు	రాచర్ల
ఆర్.వాసుదేవరావు	డిటి, ఎన్‌జిపాడు	పామూరు
ఏవిఎస్ శ్రీనివాసరావు	ఎస్‌డిటి, మార్కాపురం	బాపట్ల జిల్లా
ఎమ్‌డి నయీంఅహ్మద్	పుల్లలచెరువు(లీవ్)	నెల్లూరు జిల్లా
బి.జయవర్ధన్	తర్లుపాడు(లీవ్)	నెల్లూరు జిల్లా

వైద్యులు లేక.. పశుపోషకుల ఇక్కట్లు..

- వైద్యం అందక చనిపోతున్న పశువులు
- పట్టించుకోని అధికారులు
- ఆందోళనలో పశుపోషకులు



వేటపాలెం పశువైద్యశాల

ప్రజాశక్తి - వేటపాలెం

స్థానిక పశువైద్యశాలలో పశువులకు సక్రమమైన వైద్యం అందటం లేదు. దీంతో పశువులు మృత్య వాత పడుతున్నాయని రైతులు గగ్గోలు పెడుతున్నారు. రెగ్యులర్ వైద్యురాలు ఉన్నప్పటికీ ఆమె డిప్యూటేషన్‌పై వెళ్ళటంతో ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. వారంలో రెండు రోజులు మాత్రమే ఇన్‌ఛార్జడి వస్తున్నారు. ఇక్కడ పశు వైద్యం అందని ద్రాక్షగా మారింది. పశువైద్యశాల పరిధిలో దేశాయిపేట, రామన్నపేట, చల్లారెడ్డిపాలెం, అక్కాయిపాలెం, వేటపాలెం గ్రామాల పశుపోషకులకు ఈ వైద్యశాలే ఆధారం. ఆయా గ్రామాల పరిధిలో సుమారు 20వేల పైగా గేదెలు, గొర్రెలు, మేకలు, కుక్కలు, కోళ్లు ఉంటాయి. ఈ ప్రాంతంలో రైతులు వ్యవసాయానికి అనుబంధంగా పాడి పరిశ్రమ కూడా నిర్వహిస్తుంటారు. మూగజీవాలకు అనారోగ్య సమస్యలు తలెత్తితే వైద్యశాలకు వెళ్లినా వైద్యం అందడం లేదు. గతంలో ఇక్కడ పనిచేసే వైద్యురాలు భాగ్యశ్రీ 20 నెలల క్రితం విశాఖపట్టణంకు డిప్యూటేషన్‌పై వెళ్లారు. అప్పటి నుండి మూగజీవాల రైతులు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. వేటపాలెం పశు వైద్యశాలకు అప్పటి నుంచి పందిళ్లపల్లి పశు వైద్యురాలికి ఇన్చార్జి బాధ్యతలు అప్పగించారు. ఆమె మంగళ, శుక్రవారాల్లో మాత్రమే ఇక్కడ అందుబాటులో ఉంటారు. మిగిలిన రోజుల్లో వెటర్నరీ సహాయకులు, పశుమిత్రలతోనే వైద్యం చేయించుకోవాల్సిన పరిస్థితి రావడంతో పోషకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు అనుకోకుండా విపత్తు వస్తే ప్రైవేటు వైద్యులను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని పశు పోషకులు వాపోతున్నారు. వేటపాలెం పంచాయతీ సర్వోదయ కాలనీ పశుపోషకులు భూపతి వెంకట్రావుకు సంబంధించిన ఆవు దూడను ఈనే సమయంలో మాయతో పాటు మేము కూడా బయటకు వచ్చింది. దీంతో వెంకటరావు వేటపాలెం పశు వైద్యశాల వద్దకు పరుగులు తీశాడు. ఆ సమయంలో ఇన్చార్జి వైద్యురాలు సెలవులో ఉన్నారు. మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న చల్లారెడ్డిపాలెం పశు వైద్యశాలకు పరుగులు తీశాడు. అక్కడి కాపౌండర్ వేటపాలెం వచ్చి అనారోగ్యానికి గురైన ఆవును పరిశీలించారు. పశు వైద్యుణ్ణి ఫోన్ ద్వారా సంప్రదించి వైద్య సేవలు అందించాడు. అయినప్పటికీ ఆవు చనిపోయింది. చనిపోయిన ఆవు ధర రూ.లక్షపైగా ఉంటుందని బాధితుడు వెంకట్రావు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. పశువైద్యశాల్లో పర్మినెంట్ వైద్యులు లేనందున గతంలోనూ బాపయ్య నగర్‌కు చెందిన బాలాజీకి సంబంధించిన 50 కోళ్ళ మత్యువాత పడ్డాయి. పశువులతో పాటు గొర్రెలు, మేకలు సరైన వైద్యం అందక మృతిచెందిన ఘటనలు ఉన్నాయి. ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో పశు సంపదను కాపాడేందుకు ఉచిత పశువైద్యశిబిరాలు నిర్వహిస్తోంది. ప్రభుత్వ లక్ష్యం నెరవేరాలంటే వైద్యశాలల్లో అవసరమైన మేర సిబ్బందిని అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాల్సి ఉంది. ఇప్పటికైనా సంబంధిత ధికారులు స్పందించి వేటపాలెం పశు వైద్యశాలకు రెగ్యులర్ పశు వైద్యులను నియమించాలని పశుపోషకులు కోరుతున్నారు.

వర్షపు నీటిని ఒడిసిపడితేనే భవిష్యత్ తరాలకు నీళ్లు

- గత 36ఏళ్ల నుంచి వర్షపు నీటితో జీవనం
- వర్షపు నీరు అలటైతే సాధారణ నీరు ఉపయోగించడం కష్టం

ప్రజాశక్తి - అద్దంకి


మనిషి బ్రతకాలంటే మంచి శుద్ధ జలాలు అవసరం. ఇవి దొరకని రోజున అనేక విధాలుగా ప్రజానీకం ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఉంటుంది. చిన్నప్పటి నుంచి నీటి సంరక్షణ నినాదాలు, సంరక్షణ పద్ధతుల గురించి వింటున్నాం. కానీ వాటిని పాటించడం మాత్రం మరిచామని చెప్పవచ్చు. అందుకే ప్రస్తుత కాలంలో నీటి ఎద్దడి ఎదుర్కోవడం ఎక్కువైంది. అలా కాకుండా ఉండాలంటే ప్రతి ఒక్కరూ నీటి వృథా తగ్గించడంతోపాటు వర్షపు నీటిని నిల్వ చేసి భూ గర్భజలాలను కాపాడుకోవాల్సి ఉంది. ప్రస్తుతం మన ప్రాంతంలో మూడింట ఒక వంతు భూ గర్భ జల వనరులు ఆందోళనకర పరిస్థితుల్లో ఉన్నాయి. చిన్న, సన్నకారు రైతులు, మహిళలు, బలహీన వర్గాల ప్రజలు భూ గర్భ జలాల క్షీణతతో కలుషిత నీటితో ఇబ్బందులు పడుతున్నారు. మనకు ప్రకృతి ప్రసాదించిన వనరులను ఉపయోగించుకోవాలి. దాని కోసం వర్షపు నీటి హార్వెస్టింగ్, సాంప్రదాయ నీటి వనరుల పునరుద్ధరణ, నీటి పునర్వినియోగం, వాటర్ డెవలప్మెంట్, అడవుల పెంపకం వంటి నీటి సంరక్షణ పద్ధతులు పాటించడం అత్యవసరం. ప్రతి ఒక్కరూ ఇళ్ల వద్ద ఐదు నుంచి పది మొక్కలు నాటి వాటిని సంరక్షించాల్సిన బాధ్యత మనందరిపై ఉంది. ప్రకృతి మనకు ప్రసాదిస్తున్న వనరుల్లో వర్షపు నీరు ఒకటి. సరైన ఆలోచనతో ప్రతి వర్షపు చుక్క వృధా కాకుండా మనం ఉపయోగించుకోవచ్చు. భూమిలోకి ఇంకించడమే కాకుండా ఫిల్టర్ చేసి వంటకు, తాగడానికీ వాడుకోవచ్చు. వాటిని ఎలా ఆదా చేసుకోవాలో తెలుసుకోవాల్సిన అవసరం ఉంది.

అతి తక్కువ ఖర్చుతోనే..

ఇంటి పైకప్పుపై పడే వర్షపు నీటి సంరక్షణకు అతి తక్కువ ఖర్చుతోనే ఏర్పాటు చేసుకోవడానికి అనేక మార్గాలు ఉన్నాయి. ఇళ్లు, బహుళ అంతస్తులపై పడే వర్షపు నీటిని కిందికి పంపే పైపులకు సంపు ప్రాంతంలో చిన్న ఫిల్టర్ పెట్టి సంపులోకి మళ్లించాలి. వర్షపు నీళ్లు అత్యంత స్వచ్ఛమైనవి. డాబాపై పడిన తర్వాత అందులోకి వ్యర్థాలు చేరుతాయి. వాటిని ఫిల్టర్ ద్వారా వడబోసి స్వచ్ఛమైన నీటిని సంపులోకి పంపుతుంది. తర్వాత సంపులో ఒకటి, రెండు క్లోరిన్ మాత్రలు కలిపి ఇంట్లో తాగడానికి, వంటకు ఉపయోగించవచ్చు. ఇంటి నిర్మాణ సమయంలోనే ముందుచూపుతో వ్యవహరిస్తే చాలా ఎక్కువ వాననీటిని సంరక్షించుకోవచ్చు.

ప్రతి ఇంటా ఇంకుడు గుంతలు అవసరం

వాల్టా చట్టం ప్రకారం 200 చదరపు మీటర్ల కంటే ఎక్కువ విస్తీర్ణంలో నిర్మించిన అన్ని ప్రాంగణాల్లో వర్షపు నీటిని భూమిలో ఇంకించడానికి ఇంకుడు గుంతలను ప్రభుత్వం తప్పనిసరి చేసింది. ఆ తరువాత ఆ విస్తీర్ణాన్ని 300 చదరపు మీటర్లకు సవరించారు. అయినప్పటికి ఇంకుడు గుంతల నిర్మాణంలో అలసత్వం కనిపిస్తోంది. పార్కులు, కాలనీల్లోని ఖాళీ స్థలాల్లో ఇంకుడు గుంతలు తవ్వి వాన నీటిని వాటిలోకి మళ్లించడం ద్వారా బోర్లు ఇంకే పరిస్థితి ఉండదు. బోరుకు కొంత దూరంలో ఇంజక్షన్వెల్ తవ్వి అందులోకి ఈ విధానంలో వర్షపు నీటిని మళ్లించడం ద్వారా ఏడాది అంతా బోర్లు ఇంకిపోవు. మీరు గుంతలు ఏర్పాటు చేయడానికి ముందు చిన్న చిన్న రాళ్ళు, ఇసుక, సిమెంటుతో తయారు చేసిన ఒరలు, బొగ్గు పోగుచేసుకోవాలి. తీసిన గుంతలో వీటిని పొరలుగా వేయాలి. ఆ తర్వాత మీరు నీరు వాడుకునే ప్రదేశం నుంచి గుంతకు పైప్ ద్వారా కనెక్షన్ ఇవ్వాలి. ఇక మీరు వాడే నీరు నిల్వ అయినట్లే. ఇలా చేస్తే చుట్టు పక్కల బురద, ఈగలు, దోమలు వంటి వాటిని రాకుండా నివారించొచ్చు.



వర్షపు నీటిని పొదుపు చేసుకునే విధానం

అవగాహన ఎంతో ముఖ్యం

నీటి సంరక్షణ గురించి ప్రభుత్వాలు లేదా అధికారులు పని చేయడమే కాదు ప్రజలూ అవగాహన పెంచుకోవాలి. నీటిని సంరక్షిస్తేనే భవిష్యత్తు తరాలకు మనుగడ ఉంటుందనే విషయాన్ని అర్థం చేసుకోవాలి. ఎంత అవకాశం ఉంటే అంత నీటిని నిల్వ చేసుకోవాలి. ఇందు కోసం సంపులోకి నీరు వచ్చేలా ఏర్పాటు చేసుకోవాలి. ఫైబర్ ట్యాంకులనూ ఇందుకు వినియోగించుకోవచ్చు. ఆ నీటిని శుభ్రపరిచి తాగునీరు మినహా ఇతర అవసరాలకు, గార్డెనింగ్ కోసం వాడుకోవచ్చు. సగటున కురిసే వర్షం నీటిలోని 20 శాతాన్ని నిల్వ చేసుకుంటే, ఇంట్లో సాధారణ అవసరాలకు ఏడాది దాకా ఉపయోగపడుతుందని ఒక అంచనా. వాన నీరు ఏడాదిపాటు పాడవదు. నిల్వ చేసుకున్న జలాన్ని ఏ అవసరాలకు వాడాలనే అంశంలో అవగాహన ఉన్నట్లయితే ఆ స్థాయిలో ఫిల్టరేషన్ చేసుకోవాలి. యాక్టివ్ కార్బన్, 20–40 ఎంఎం అగ్రిగేట్, ఇసుక వంటివాటితో కాలమ్స్ చేసి ఫిల్టరేషన్నేసుకుని ఇందులో పార్టికల్స్ రాకుండా చేసినట్లయితే పరిశుభ్రమైన నీరు మనకు లభిస్తుంది. వర్షపు నీటిని నిల్వ ప్రక్రియను ఎవరైనా చేసుకోవచ్చు. తాగునీటి అవసరాల కోసం వాడుకోవాలనుకుంటే మాత్రం నిపుణుల పర్యవేక్షణలో చేయడం మంచిదని అభిప్రాయాన్ని వెలిగించారు.

గత 30ఏళ్ళు నుండి వర్షపు నీటినే ఉపయోగిస్తున్నారు

ప్రకృతిని అనుసంధానం చేసుకొని కొందరు జీవనం కొనసాగిస్తుంటారు. ఈ కోవకు చెందిన విశ్రాంత ఎస్‌బిఐ ఉద్యోగి చేబ్రోలు రామారావు దంపతులు ప్రధానంగా గత 30 ఏళ్ల నుండి వర్షపు నీటిని అమృత ధారలాగా ఉపయోగించుకుంటున్నారు. వర్షం కురిసిన సమయంలో ఆ నీటిని విలువ చేసుకొని డ్రమ్ముల్లో ఉంచుకొని వాటిని నిత్యవసరాలకు ఉపయోగిస్తూ ఉంటారు. ఆ నీటితో వంట చేసుకోవడం, స్నానాలకు ఉపయోగించుకోవడం వారికి ఒక అలవాటుగా మారింది. బోర్లు, గుండ్లకమ్మ నీటిని ఉపయోగించుకోవడం కొంత అసౌకర్యానికి గురవుతున్నామనే అభిప్రాయాన్ని తెలిపారు.

ముప్పాళ్లలో నేత్రదానం

ప్రజాశక్తి - ఇంకొల్లు

నాగులుప్పలపాడు మండలం ముప్పాళ్లలో కల్లూరి పార్వతమ్మ (66) మృతి చెందగా ఆమె కుటుంబ సభ్యులు ఆమె కళ్ల కార్నియాను దానం చేశారు. గుంటూరు పెదకాకానికి చెందిన శంకర్ నేత్ర వైద్యశాల వైద్యులు వచ్చి శనివారం కంటి కార్నియా సేకరించారు. ఆమె భర్త వెంకటేశ్వర్లు బంధువు ఆంజనేయులు, ఇతర బంధు వర్గాన్ని అడిగిన వెంటనే కంటి కార్నియా దానం చేసినందుకు ఇంకొల్లు రోటరీ అవయవ దాన కమిటీ సభ్యులు జట్టి వెంకటేశ్వర్లు (స్వామి), సోమేపల్లి రామ్మోహనరావు, రోటరీ అధ్యక్షులు మొహమ్మద్ రఫీ, సాంబశివరావు అభినందించారు.ఠ

జూదరులు అరెస్టు

ప్రజాశక్తి - బాపట్ల

మండలంలోని చిన్న బేతపూడి కాలవ కట్టపై పేకాట ఆడుతున్న ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు వెదుళ్ళపల్లి ఎస్ఐ భాగ్యరాజు శనివారం తెలిపారు. వారి వద్ద నుండి రూ.32వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. జూదం, కోడి పందాలు, బెల్ట్ షాపుల ద్వారా మద్యం విక్రయాలు, సారా తయారు చేసి విక్రయిస్తే చర్యలు తీసుకుంటా మని హెచ్చరించారు. ఈపాటికే అనుమానితులపై బైండోవర్ కేసులు నమోదు చేశామని అన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని అన్నారు.



విరాళం అందజేస్తున్న దాతలు

మండపం నిర్మాణానికి విరాళం

ప్రజాశక్తి - అద్దంకి

సింగరకొండ శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి రాతి ముఖ మండప నిర్మాణానికి అనేకమంది దూర ప్రాంతాల భక్తులు విరాళాలు అందిస్తున్నారు. ఒంగోలు పట్టణానికి చెందిన ఆముదాల ప్రకాశరావు, ఈశ్వరమ్మ దంపతులు రూ.10,1116 లను దేవస్థానం సీనియర్ అసిస్టెంట్ మదన్మోహన్‌కు చెక్కు రూపంలో అందించారు. కార్యక్రమంలో ధాత కుటుంబ సభ్యులతోపాటు దేవస్థానం సిబ్బంది పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహస్వామి శాంతి కళ్యాణం

ప్రజాశక్తి - అద్దంకి

సింగరకొండ శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం నందు స్వామివారి జన్మ నక్షత్రం స్వాతి నక్షత్రం సందర్భంగా స్వామి వారికి శాంతి కళ్యాణ మహోత్సవం ఆదివారం నిర్వహించేందుకు తగిన ఏర్పాట్లు చేసినట్లు కార్యనిర్వాహణ అధికారి శ్రీనివాసరావు తెలిపారు. ప్రతినెల స్వామి వారి జన్మ నక్షత్రమైన స్వాతి నక్షత్రం రోజున కళ్యాణం జరపబడుతుంని తెలిపారు. కళ్యాణంలో పాల్గొను దంపతులు రూ.1,116 చెల్లించి పాల్గొనవచ్చని అన్నారు. అనంతరం భక్తులకు ప్రసాదం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.



రామలింగేశ్వరస్వామిని దర్శించుకున్న అమర్నాథ్

అన్నసంతర్పణలో అమర్నాథ్

ప్రజాశక్తి - వేటపాలెం

మండలంలోని ఆనుమల్లిపేటలోని గంగా పార్వతీ సమేత అమరలింగేశ్వర స్వామి రామలింగ చౌడేశ్వరీ దేవస్థానంలో తెలుగు యువ నాయకులు మద్దులూరి గౌరీ అమర్నాథ్ శనివారం దర్శించుకున్నారు. అనంతరం అన్నసంతర్పణ ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపిసి చైర్మన్ కొతరపు జనార్దనరావు, గుత్తి శివయ్య, దుర్గామల్లేశ్వరి, జంగిలి రాముడు పాల్గొన్నారు.



చుండూరులంప సంబరాలు ప్రారంభిస్తున్న పెద్ద శెట్లు

కొలుపులు ప్రారంభం

ప్రజాశక్తి - వేటపాలెం

స్థానిక నాయనపల్లిలోని చుండూరులంప పెద్ద శెట్లు కనక నాగవరపమ్మ అమ్మవారి తిరునాళ్ల సందర్భంగా దేవర ఇంటి వద్ద పూజలు నిర్వహించి సంబరాలు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పోతురాజు స్వామికి బోనం సమర్పించి పోలేరమ్మకు మొక్కులు చెల్లించారు. మహాలక్ష్మి అమ్మవారికి, అంకమ్మ తల్లికి, ముత్యాలమ్మ తల్లికి పసుపు, కుంకుమ, వడపప్పు, పానకాలు నైవేద్యం సమర్పించారు. మేళ, తాళాలు, కనక తప్పెట్లతో అత్యంత వైభవంగా జరిగాయి. కార్యక్రమంలో పెద్దశెట్లు చుండూరు వెంకటేశ్వర్లు, పొగడదండ శ్రీనివాసరావు, బాణాల సాంబశివరావు, సోమిశెట్టి శ్రీనివాసరావు, గ్రామ పెద్దలు బాణాల పెద్దన్న, పొగడ దండ వెంకటేశ్వర్లు, చుండూరి సుబ్బయ్య, గంటా వెంకటేశ్వర్లు, చుండూరు మస్తానరావు, చుండూరి అర్జునరావు పాల్గొన్నారు.

ఎస్ఎ పిఎస్ హెచ్ఎం పోస్టుల కౌన్సిలింగ్ పూర్తి

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ

ఉమ్మడి ప్రకాశం జిల్లాలో ఖాళీగా ఉన్న స్కూల్ అసిస్టెంట్,పిఎస్ హెచ్ఎం పోస్టుల భర్తీకి చేపట్టిన కౌన్సిలింగ్ ప్రక్రియ శనివారంతో ముగిసింది. ఒంగోలులోని డిఆర్ఆర్ఎం స్కూల్‌లో ఆర్‌జెడి లింగేశ్వర రెడ్డి, డిఇఒ కిరణ్ కుమార్ పర్యవేక్షణలో గత రెండు రోజులుగా కౌన్సిలింగ్ నిర్వహించారు. స్కూల్ అసిస్టెంట్ మ్యాథ్స్ నాలుగు పోస్టులకు సీనియారిటీ జాబితాలో 106 నంబరు నుంచి 126 వరకు, సోషల్ స్టడీస్ 13 పోస్టులకు సీనియార్టీ లోని 55 నుంచి 120 వరకు, బయోలాజికల్ సైన్స్ మూడు పోస్టులకు సీనియారిటీ జాబితాలోని 76 నుంచి 90 వరకు , ఫిజికల్ సైన్స్ నాలుగు పోస్టులకు జాబితా 25 నుంచి 45 వరకూ కౌన్సిలింగ్ నిర్వహించారు. పిఎఫ్‌హెచ్ఎం పోస్టులకు 111కు సీనియార్టీ జాబితాలోని 451 నుంచి 2000 వరకూ పిలిచారు. పశ్చిమ ప్రాంతంలో, దూర ప్రాంతంలో మిగిలి ఉన్న పిఎస్ హెచ్ఎం పోస్టుల్లో చేరేందుకు ఉపాధ్యాయులు ఆసక్తి చూపకపోవడంతో 100 పోస్టులకు రెండు వేల మందిని కౌన్సిలింగ్‌కు పిలిచారు. నేడు కౌన్సిలింగ్ హాజరైన ఉపాధ్యాయులందరూ ఆదివారం గతంలో పనిచేసిన పాఠశాలల నుంచి రిలీవ్ అయి సోమవారం సాయంత్రంలోపు కొత్త పాఠశాలలో జాయిన్ కావాలని డిఇఒ కిరణ్ కుమార్ ఆదేశించారు.



అధికారులతో మాట్లాడుతున్న ఆర్‌జెడి

ఇప్పటివరకు జిల్లాలో స్కూల్ అసిస్టెంట్లకు సంబంధించి తెలుగు మీడియంలో తెలుగు 79, హిందీ 71, ఇంగ్లీష్ 136, బైలాజికల్ సైన్స్ 133, ఫిజికల్ సైన్స్ 67,మాథ్స్ 158, ఫిజికల్ సైన్స్ 67, స్పెషల్ ఎడ్యుకేషన్ 11,సంస్కృతం ఒకటి, పీడీలు180, ఉర్దూ మీడియంలో బయోలాజికల్ సైన్స్ 4 ఫిజికల్ సైన్స్ 6, సోషల్ 1, మ్యాథ్స్ 3 ఉర్దూ నాలుగు కలిపి 1022 పోస్టులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. కౌన్సిలింగ్ ప్రక్రియలో ఆర్‌జెడి లింగేశ్వర రెడ్డి, డిసిఇబి కన్వీనర్ మర్రి శ్రీనివాసరావు, డిప్యూటీ డిఇఒ చంద్రమౌళేశ్వరరావు, యుటిఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు షేక్ అబ్దుల్ హై,డి.వీరాంజనేయులు, ఉపాధ్యక్షుడు ఎస్.రవి, ఎపిటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.లక్షి నారాయణ, నాయకులు పివి. సుబ్బారావు, పిఆర్‌టియు నాయకుడు పులి శ్రీనివాస్, ఎస్‌టియు నాయకులు ఎర్రయ్య, ఎపిటిఎఫ్ (257)నాయకులు శ్రీనివాసులు, ఎ. అమ్మయ్య, వై.అనీల్ కుమార్ పాల్గొన్నారు.

9న ప్రతిభా అవార్డుల ప్రదానం

ఈ ఏడాది పదవ తరగతిలో ప్రతిభ చూపిన 242 మంది, ఇంటర్మీడియట్‌లో ప్రతిభ చూపిన 36 మంది విద్యార్థులకు ఈ నెల 9న ప్రతిభ అవార్డులు అందజేయనున్నట్లు ఆర్‌జెడి లింగేశ్వర రెడ్డి, డిఇఒ కిరణ్ కుమార్ తెలిపారు. పెళ్లూరులోని సాయిబాబా సెంట్రల్ స్కూల్ నిర్వహించనున్న కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లపై విద్యాధికారులతో సమీక్షించారు. ఈ కార్యక్రమంలో డిఐఇఒ కె.ఆంజనేయులు డిప్యూటీ డిఇఒ చంద్రమౌళీశ్వరరావు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి రైతు సంఘం నేతల పరామర్శ

ప్రజాశక్తి -ఒంగోలు సిటీ

పొగాకు అమ్ముడు పోక ఆర్థిక సమస్యలతో మనో వేదనకు గురైన పొగాకు రైతు ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈ ఘటన ప్రకాశం జిల్లా కొండపి మండలం నెన్నూరుపాడు గ్రామంలో చోటు చేసుకుంది. మతుడు తండ్రి చల్లా బ్రహ్మారెడ్డి ఒంగోలు రిమ్స్ లోని మార్చురి వద్ద మీడియాకు అందించిన సమాచారం మేరకు... నెన్నూరుపాడు గ్రామానికి చెందిన మధుసూదనరెడ్డి (45) గతేడాది పొగాకుకు లాభాలు రావడంతో ఈ ఏడాది 7 ఎకరాల సొంత భూమితో పాటు మరో 6 ఎకరాలు (ఎకరాకు రూ.20 వేలు) కౌలుకు తీసుకుని పొగాకు పంట సాగు చేశారు. పంట సాగు కోసం బ్యాంకు ద్వారా, ప్రైవేట్ వ్యక్తుల నుంచి సుమారు రూ. 20 లక్షలు పైగా అప్పులు చేశారు. ఏడు ఎకరాల్లో కలిపి సుమారు మొత్తం 90 క్వింటాళు ్ళ పొగాకు దిగుబడి వచ్చింది. వేలం ప్రారంభం అనంతరం 4,5 సార్లుగా పొగాకు కొండపి వేలం కేంద్రంలో అమ్మే ప్రయత్నం చేశాడు. అమ్మకానికి తీసుకెళ్లిన ప్రతిసారి సగం నో బిడ్ చెప్పారు. కేవలం 7 క్వింటాళ్ళు మాత్రమే అమ్మాడు. సరైన గిట్టుబాటు ధర లేక, పొగాకు అమ్ముడు పోక మధుసూదన్ మనోవేదనకు గురయ్యాడు. పచ్చాకు కూలీలకు ,గ్రేడింగ్ పని వారు కూలీ డబ్బుల కోసం ఒత్తిడి చేస్తున్నారు. పొగాకు అమ్మగా వచ్చిన నగదులో బ్యాంకర్లు కొంత లోనుకు జమ చేసుకున్నారు. మృతుడి పెద్ద కుమారుడు వంశీ కష్ణరెడ్డికి ఇంజినీరింగ్ ఫీజు చెల్లించాల్సిఉంది. చిన్న కుమారుడు కోటిరెడ్డి ఎంబిబిఎస్ చదువుకు కొంత ఫీజు చెల్లించారు, ఇంకా ఫీజు బకాయి ఉంది. పొగాకు అమ్ముడు పోని పరిస్థితి, ఇద్దరు బిడ్డల చదువులకు ఫీజులు, పెట్టుబడి బకాయిలు తదితర ఆర్థిక సమస్యలతో మృతుడు సతమతమవుతున్నాడు. ఈ పరిస్థితులో ఈ నెల 4 న కొండపి వేలం కేంద్రం వెళ్లిన మధుసూదన రెడ్డి రాత్రికి ఇంటి చేరలేదు.ఫోను స్విచ్ ఆఫ్‌లో ఉంది. దీంతో ఈనె 5న కొండపి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫోను సిగ్నల్ ద్వారా మధుసూదనరెడ్డి మతదేహాన్ని వేలం కేంద్రం సమీపంలోఉన్నట్లుగా పోలీసులు గుర్తించారు. మత దేహం వద్ద పురుగుమందు డబ్బా ఉంది. దీంతో పోలీసులు పురుగు మందు తాగి ఆత్మ హత్యకు పాల్పడినట్లుగా పోలీసులు కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని శనివారం ఒంగోలు రిమ్స్ కు తరలించారు. మతుడి భార్య సుప్రజ, ఇద్దరు కుమారులు ఉన్నారు.



మృతుడి తండ్రితో మాట్లాడుతున్న నాయకులు

మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలి : ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం

ఆంధ్రప్రదేశ్ రైతుసంఘ అధ్యక్షకార్యదర్శులు జుజ్జూరు జయంతి బాబు, పమిడి వెంకట రావు మతుడి కుటుంబసభ్యులను రిమ్స్ వద్ద పరామర్శించారు. పొగాకు అమ్ముడు పోక ఆర్థిక సమస్యలతో పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన మధుసూదనరెడ్డి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించిన వారిలో రైతు సంఘ నాయకులు వాసు, దాసరి ఆంజనేయులు, యిర్మియా తదితరులు ఉన్నారు.

నిబంధనలు పాటించని

విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ

విద్యాసంవత్సరం ప్రారభానికి ముందే కొన్ని ప్రైవేటు, కార్పొరేటు విద్యా సంస్థలు ఫీజుల దోపిడీని ప్రారంభించినట్లు ఎస్ఎఫ్ఐ జిల్లాకమిటీ ఆరోపించింది. ఎల్‌బిజి భవన్‌లో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు వినోద్, అధ్యక్ష కార్యదర్శులు విజయ్ బండి వీరాస్వామి మాట్లాడారు. ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా విద్యాసంస్థ ఆవరణలోనే పుస్తకాలను అధిక ధరలకు అమ్ముతున్నట్లు ఆరోపించారు విద్యాసంస్థ పేరు చివరిలో టెక్నో, ఈ టెక్నో, ఒలంపియాడ్ లాంటి ఆకర్షణీ యమైన పేర్లను వినియోగిస్తున్నట్లు తెలిపారు. ఇది నిబంధనలకు విరుద్ధమని వారు తెలిపారు ఫీజు నియంత్రణా చట్టం ప్రకారం ఫీజు వివరాలు బహిరంగంగా నోటీసు బోర్డులో పెట్టాలన్నారు. దీన్ని కార్పొరేట్ విద్యాసంస్థలు పాటించడం లేదన్నారు. స్కూళ్ల బస్సులు ఫిట్నెస్ కలిగివుండటం లేదన్నారు. అందుకోసం స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని డిమాండ్ చేశారు. నారాయణ విద్యాసంస్థలు ప్రభుత్వ నిబంధనలను పాటించడం లేదన్నారు. భద్రత లేని భవనాల్లో విద్యాసంస్థలు నిర్వహిస్తున్నట్లు వారు విమర్శించారు. విద్యా సంవత్సరం ప్రారంభం కానున్న నేపథ్యంలో జిల్లా విద్యాశాఖ అధికారులు విద్యార్థి సంఘాల నాయకులతో ఉమ్మడి సమావేశం నిర్వహించి విద్యారంగ సమస్యలపై చర్చించాలని వారు కోరారు.



మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ఎట్టకేలకు....

రైతుల ఆందోళనకు ప్రభుత్వం దిగొచ్చింది. రైతుసంఘం, కౌలు రైతు సంఘాలు బర్లీ పొగాకు రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని ఆందోళనలు చేపట్టాయి. పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు కూడా రైతుల తరుపున చొరవ తీసుకున్నారు. ఆయన కూడా తనవంతు కర్తవ్యంగా ప్రభుత్వం దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లారు. అన్ని వైపులా పోరాటం, ఒత్తిళ్లు పెరిగాయి. మంత్రులూ మార్టూరు వచ్చి పొగాకు రైతులతోభేటీ అయ్యారు. వ్యాపారులపైనా ఒత్తిడి పెంచారు. కొనుగోళ్లు లక్ష్యం పెట్టారు. వ్యాపారులు కొనగా మిగిలిపోయిన పొగాకును మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయించాలని నిర్ణయించారు.శనివారం మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోళ్లను కూడా ప్రారంభించారు. మార్కెట్‌లో పోటీ ఉంటేనే రైతులకు మేలు జరుగుతుంది. వ్యాపారులకు ప్రత్యామ్నాయంగా ప్రభుత్వ రంగసంస్థల జోక్యం ఉండాలి. ఇపుడు బర్లీ రైతులకు ఊరట కలిగింది. మార్క్‌ఫెడ్ నుంచి రూ.300 కోట్లు విలువైన పంటను కొనేందుకు అవకాశాలు కనిపిస్తున్నాయి.అక్కడ సమస్యకు ఎంతో కొంత పరిష్కారం కనిపిస్తోంది. వర్జీనియా పొగాకు సంక్షోభం కొనసాగుతోంది. ఇక్కడ ఎవరూ అంతగా రైతుల పక్షాన చొరవ తీసుకోలేదు. మంత్రిగానీ, ఎమ్మెల్యేలుగానీ దీనిపై సీరియస్‌గా దృష్టి సారించలేదనే చర్చ రైతుల్లో సాగుతోంది. వేలంలో ఎస్టీసీ లేదా సమాఖ్యను దించి పోటీ పెంచాలి. ఇపుడు జరగాల్సింది ఇదే. నిత్యం వేలంలో 25శాతం బేళ్లను తిరస్కరిస్తున్నారు. చివరికి అంతా కొంటారు.ఇలా చేయడం వల్ల ధరల్లో కోతలు పెడతారు. ఇదంతా వ్యాపారుల ఎత్తుగడ వ్యూహంగా చెప్పక తప్పదు. మరోవైపు సగటు ధరలూ పడిపోతున్నాయి.రెండొంతుల పంటను కొనేశారు.40 మిలియన్లకుపైగానే పంటను కొన్నారు. గరిష్టధర ఆరంభం నుంచి ఇప్పటి వరకూ రూ.280 గా ఉంది. మరోవైపు సగటు ధర రూ.254లకు పడిపోయింది. ఇదే తీరు కొనసాగితే రైతులకు నష్టాలు రావడం ఖాయమని భావిస్తున్నారు. ఈనెల 11న పొదిలి వేలం కేంద్రాన్ని వైసిపి అధినేత జగన్ సందర్శించనున్నారు. గతనెలలోనే జగన్ రావాల్సి ఉండగా వాతావరణం అనుకూలంగా లేనందున వాయిదా పడింది. ఇపుడు వైసిపి ఈ సంక్షోభంపై పార్టీపరంగా దృష్టిసారించింది. ఇక్కడా వేలంలో ప్రత్యామ్నాయంపై పాలకపక్షం దృష్టిసారించాల్సి ఉంది.



వేసవి ముగిశాక ఎండల తీవ్రత పెరిగింది.వాతావరణంలో మార్పులు స్పష్టంగా ఉన్నాయి. మరోవైపు తాగునీటి సమస్య కూడా వెంటాడుతోంది. ట్యాంకర్లతో నీటిని తరలిస్తున్నారు. 37 నుంచి 38 డిగ్రీల ఉష్ణాగ్రత నమోదవుతోంది. దీని ప్రభావం 40 డిగ్రీలుగా కనిపిస్తోంది.ఎండలకు బయటకు రావాలంటేనే ప్రజలు భయపడుతున్నారు. మేలో ఎండలు అంతగా లేవు.జూన్ మొదటివారంలోనే వేసవి ప్రభావం కనిపిస్తోంది. ఉపాధి కూలీలు ఇబ్బందులు పడుతున్నారు.రోడ్ల వెంట చిరువ్యాపారులూ ఎండలకు అవస్థలు పడుతున్నారు.

ఏడాది పాలనపై పాలకపక్షం విజయోత్సవాలు జరుపుకుంటుంటే ప్రతిపక్ష వైసిపి మాత్రం వెన్నుపోటు దినంగా ఫలితాల రోజును ప్రకటించింది. తొలిఏడాదికి రాజకీయ వేడి పెరిగింది. విమర్శలు..ప్రతివిమర్శలతో తెలుగుదేశం-వైసిపి మధ్య రాజకీయ వేడి తీవ్రమైంది.వైసిపి అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో కదలింది. పార్టీశ్రేణులు పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపట్టాయి. పార్టీ ఎమ్మెల్యేలు, ఇన్‌ఛార్జులు భాగస్వాములయ్యారు. ప్రభుత్వంపై ఇటీవల కాలంలో వైసిపి పెద్ద కార్యక్రమం కూడా ఇదే. ఇక పాలకపక్షం కూడా ఇచ్చిన హామీలపై తర్జనభర్జన పడుతోంది.పెన్షన్ల పెంపు, అన్నా క్యాంటీన్లు, ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్ల పథకాన్ని అమలులో పెట్టింది. సూపర్‌సిక్స్‌లో ఐదు పథకాలు పెండింగులోనే ఉన్నాయి. జూన్ నుంచి తల్లికి వందనం పథకం అమలు చేస్తామని చెబుతున్నారు. ప్రతి మహిళ నెలకు రూ.1500 కోసం ఎదురుచూస్తోంది. అన్నదాత సుఖీభవ, మహిళలకు ఆర్‌టిసి బస్సుల్లో ఉచిత ప్రయాణం వంటివి ఆగస్టు నుంచి అమలు చేయాలనే ఆలోచనలో ఉన్నారు. వీటిపైనా స్పష్టతలేదు. ఏడాది గడిచినా హామీలు అమలు ప్రశ్నార్థకంగా మారింది. వెంటనే అమలు చేయాల్సిన ప్రభుత్వం ఆర్థిక ఇబ్బందులు పేరుతో ఏడాది వదిలేశారు. లబ్ధిదారులకు ఎదురు చూపులే మిగిలాయి. ప్రజలు ఏడాది కాలంగా లబ్ధిని కోల్పోయారు. ఇదే ప్రభుత్వంపై నిధానంగా అసంతృప్తి పెరగడానికి కారణంగా కనిపిస్తోంది.పేదల్లో చర్చ మొదలైంది.చెప్పిన మాటలు ఆచరణలో లేవనే చర్చ సాగుతోంది. అటు పాలకపక్ష నేతల్లోనూ ఇచ్చిన హామీలు అమలు చేయలేకపోయామనే ఆందోళన పెరుగుతోంది. జిల్లా హామీలు ఎండమావులుగానే మిగిలాయి.ఏడాదిలో వెలిగొండ ప్రాజెక్టు పూర్తి, మార్కాపురం జిల్లా ఏర్పాటు, జిల్లా డెయిరీ పునరుద్ధరణ, ఇతర సాగునీటి ప్రాజెక్టులు, తాగునీటి పథకాలు ,అండర్‌డ్రైనేజీలు వంటివి ముందుకు సాగలేదు. కేంద్రం నుంచి ఏమీ రాలేదు. వెనుకబడిన జిల్లాగా గుర్తించినా నిధులు ఏమీ రాలేదు. దీంతో ఏడాదిలో అభివృద్ధి అనేది ప్రశ్నార్థకంగామారింది.పాలకపక్ష నేతలు నియోజకవర్గాల్లో అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనేందుకు ఏమీ కనిపించడం లేదు. దీంతోఅందరూ చిన్నచిన్న కార్యక్రమాలు, పెళ్లీపేరంటాళ్లకే సమయమంతా కేటాయిస్తున్నారు. రెండో ఏడాదిలోకి అడుగుపెడుతోన్న తరుణంలో జిల్లా అభివృద్ధి ప్రణాళికపైపాలకపక్షం దృష్టిసారించాల్సిన అవసరం ఉంది.